సోమవారం
5-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 223
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రైతుల రక్షణ కవచం
'భూభారతి'

- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- నేటి నుంచి 28 మండలాల్లో అమలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ భూ పరిపాలనలో నూతన అధ్యాయానికి నాంది పలికిన భూభారతి చట్టాన్ని దశల వారీగా అమలు చేయనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ చట్టం రైతులకు రక్షణ కవచమన్నారు. సోమవారం నుంచి 28 జిల్లాల్లో అమలవుతుందని చెప్పారు. రైతులకు సంబంధించిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపటడమే భూ భారతి చట్టం ఉద్దేశమని, దీని సమర్థ అమలు బాధ్యత కలెక్టర్లదన్నారు. 'గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వందల కుటుంబాలు భూ మస్యలు ఎదుర్కొంటున్నాయి. 'ధరణి'తో అవస్థలు పడుతున్నారు. రైతుల జీవితాలు ఆగమాగమయ్యాయి. ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయి. ప్రజల ఆలోచనలకు భిన్నంగా భూ హక్కుల విధ్వంసం జరిగింది. రైతులకు రెవెన్యూ సేవలు దుర్భరమయ్యాయి' అని పొంగులేటి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనలు, ఆలోచనలకు అనుగుణంగా రైతు కళ్లల్లో ఆనందం చూడాలనే సంకల్పంతో భూ భారతి చట్టాన్ని తీసుకురావడమే కాకుండా దానిని సమర్థంగా అమలు చేయడానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలన్నారు. భూభారతి చట్టంపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు ఆయా మండలాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వాటిని పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని మంత్రి తెలిపారు. సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ సదస్సులకు ఆయా జిల్లాల కలెక్టర్లు తప్పక హాజరు కావాలని, రైతులు, ప్రజల సందేహాలను వారికి అర్థమయ్యే విధంగా నివృత్తి చేయాలని పొంగులేని శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కాగా, ఆదిలాబాద్‌లోని భరోజ్, భద్రాద్రి కొత్తగూడెంలోని

- మిగతా 2 లో

'ఉమ్మడి నల్లగొండ'ను
సస్యశ్యామలం చేస్తాం

- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి కంకణం
- బడ్జెట్‌లో ఇరిగేషన్‌కు రూ.23 వేల కోట్లు
- ఎస్ఎల్‌బీసీ పనులు కొనసాగిస్తాం
- లస్కర్ల నియామకానికి కలెక్టర్లకు అధికారం
- సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు అన్ని నియోజకవర్గాలలో ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మిర్యాలగూడ ఎస్పీ కన్వెన్షన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులు, పౌరసరఫరాలపై ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి ఉత్తమ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వం రూ.1.21 లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రంగా ఆయకట్టుకు సాగునీరు అందించిందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్నామని, ఇందులో భాగంగా ఈ ఏడాది బడ్జెట్లో రూ.23 వేల కోట్లు ఇరిగేషన్ కు కేటాయించినట్టు చెప్పారు. 1,100 మంది ఇంజినీర్లను కేటాయించి నీటిపారుదలశాఖ బలపడేలా చేశామని తెలిపారు. పూడికతో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోవడంతో అన్ని ప్రాజెక్టులలో పూడికతీత పనులు చేపడుతున్నామని వివరించారు. ప్రత్యేకించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూడికతీత పనులు కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ పనులను కొనసాగించేందుకు జాతీయ స్థాయిలో ఒక నిపుణుల కమిటీని వేసి దాని సూచనల మేరకు టన్నెల్ పనులను పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం డిండి ప్రాజెక్టును నిర్లక్ష్యానికి గురి చేసిందని, అలాంటిది తాము అధికారంలోకి రాగానే రూ.1800 కోట్లు కేటాయించి పనులు మొదలు పెట్టామన్నారు. అలాగే గంధమళ్ల, ఉదయ సముద్రం ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం కట్టించిన

- మిగతా 2 లో

ములుగు ప్రజల కల సాకారం

నూతన బస్టాండ్‌కు మంత్రులు పొన్నం, సీతక్క శంకుస్థాపన

విశాలాంధ్ర-హైదరాబాద్: ములుగు జిల్లా ప్రజల దశాబ్దాల కల సాకారం కాబోతోందని, మరో ఆరు నెలల్లో హైటెక్ బస్టాండ్ రాబోతోందని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించే దిశగా చర్యలు వేగవం తం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో రూ.4.80 కోట్లతో

- మిగతా 2 లో

మోదీ మొండిచేయి

రాజధాని అమరావతికి నిధుల ప్రకటన లేదు

- ప్రత్యేక హోదా... విభజన చట్టం హామీల దాటవేత
- వెనుకబడిన జిల్లాల ప్యాకేజీ ఊసేలేదు
- పోలవరం నిధులు... ఆర్ఆర్ ప్యాకేజీపై మౌనం
- వామపక్షాల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : దేశ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన కూటమి పార్టీల (టీడీపీ, బీజేపీ, జనసేన) కు జోష్ నింపినప్పటికీ, మోదీ రాష్ట్రంపై చిన్నచూపు చూశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, అమరావతి రాజధానికి నిధులేమీ ప్రకటించలేదు. అమరావతి రాజధాని సాక్షిగా జరిగిన సభావేదికపై కూటమి నేతలు పరస్పరం పొగడ్తలతో ముంచెత్తుకోవడమే సరిపోయింది. పాత పద్ధతిలోనే మోదీ తన ప్రసంగాన్ని అరకొరగా ముగించుకున్నారు. అయితే మధ్యమధ్యలో చంద్రబాబును పొగుడుతూ... ఆయన సాంకేతికత బాటను తాను సీఎంగా ఉన్నప్పుడు అనుసరించానని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ప్రసంగంలోనూ మోదీని అలాగే ప్రశంసించారు. ఇక ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సైతం మోదీని పొడిగేందుకు పోటీ పడ్డారు. మంత్రి నారా లోకేశ్ ఒక్క అడుగు ముందుకేసి... వంద మిస్సైల్స్‌తో సమానమంటూ వ్యాఖ్యానించారు. ఈ పొగడ్తలు, ప్రశంసలు బాగానే ఉన్నాయి. దానికితోడు అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు మోదీ రావడం, దానికి పెద్దఎత్తున జనం వచ్చి విజయవంతం అవ్వడం కూటమి నేతలకు మంచి హుషారుగా ఉంది. అదే సమయంలో అసలు మోదీ పర్యటనతో రాష్ట్రానికి వచ్చిన ప్రయోజనం ఏమిటనే దానిపై ఇప్పుడు విపక్షాలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాయి. ప్రధానంగా వామపక్ష పార్టీలు మోదీ పర్యటనతో ఒరిగిందేమీ లేదంటూ తేల్చిచెబుతున్నాయి. వైసీపీ నేతలు మాత్రం మోదీ పర్యటనపై మౌనం దాల్చుతున్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు షర్మిల సైతం మోదీని ఎండగట్టారు. ముంతడు మట్టి, చెంబుడు నీళ్లులాగానే ఈ సారీ మోదీ పర్యటన సాగిందంటూ ఆమె విమర్శించారు.

విభజన హామీలపై స్పష్టతేదీ?

అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టుల కోసం కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సాధించాలనే దిశగా రాష్ట్ర ప్రజలు

- మిగతా 2 లో

పాక్ దిగ్బంధం

- బాగ్లిహార్ డ్యామ్ గేట్ల మూసివేత
- క్షిపణులు, రక్షణ వ్యవస్థలు సిద్ధం
- ప్రధాని మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ కీలక భేటీ

న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల వేళ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. భారత ప్రభుత్వం పాక్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధిస్తోంది. సింధు నదీ జలాల ఒప్పందం రద్దు, పాక్ విమానాలకు భారత్ గగనతలం మూసివేయడం, దిగుమతులను స్తంభింపజేయడం లాంటి చర్యలతో పాక్‌ను అన్నివైపుల నుంచి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ క్రమంలో ఎప్పుడు ఎలాంటి పరిణామాలను చవిచూడాల్సి వస్తుందోనని, పాకిస్థాన్ భయాందోళనలకు గురవుతోంది. మిత్ర దేశాల మద్దతు కూడగట్టుకునేందుకు యత్నిస్తోంది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ... జాతీయ భద్రతా సలహాదారు, ఎయిర్‌చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. ఇక, సరిహద్దుల్లో ఉద్రిక్తత కారణంగా ప్రధాని మోదీ... వరుస భేటీలు జరుపుతున్నారు. ఇప్పటికే త్రివిధ దళాల అధికారులతో భేటీ అయ్యారు. ఇక పాక్‌కు భారత్ వరుస షాక్‌లిస్తోంది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపేసిన భారత్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. బాగ్లిహార్ ఆనకట్ట నుంచి పాక్‌కు నీటి సరఫరాను నిలిపివేసింది. నీటి ప్రవాహాన్ని ఆపేందుకు ఈ డ్యామ్ స్లూయిస్ స్పిల్‌వేపై ఉన్న గేట్లను కిందకు దించేశారు. దీంతో పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు ఇక్కడ నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. పాక్‌ను ఎండగట్టే చర్యల్లో భాగంగా ఇది రెండో ప్రతీకార చర్యగా చెప్పుకోవచ్చు. ఇక దేశ సైనిక దళాలకు ఆయుధాలను సరఫరా చేసే మ్యునిషన్స్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన రెండు ఆయుధ కర్మాగారాల సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా కర్మాగారంతోపాటు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లా ఖమరియాలో ఉన్న ఆర్డినన్స్ ఫ్యాక్టరీ సిబ్బందికి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, సంక్షోభ సమయంలో వాడేందుకు వీలుగా భారత్ స్వల్ప శ్రేణి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను కూడా సిద్ధం చేస్తోంది. కొన్నాళ్ల క్రితమే రష్యా తయారీ ఇగ్లా-ఎస్ మిసైల్స్ దిగుమతి చేసుకుంది. ఇవి వెరీషార్ట్ రేంజి ఎయిర్ డిఫెన్స్ కిందకు వస్తాయి. సైనికదళాలకు

- మిగతా 2 లో

మాకు భాగస్వాములు కావాలి... బోధకులు కాదు

న్యూదిల్లీ: అంతర్జాతీయ వ్యవహారాల్లో యూరప్ మోసపూరిత వైఖరిని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ తీవ్రంగా ఆక్షేపించారు. తమ సమస్యే ప్రపంచ సమస్యగా భావించే యూరప్ మనస్తత్వం, ఆలోచనలు మారాలని హితవు పలికారు. ఆత్మవిమర్శ ద్వారా తమ వాస్తవికతను తెలుసుకోవాలని సూచించారు. తద్వారా పురోగతి సాధించేందుకు వీలు కలుగుతుందని జైశంకర్ అన్నారు. భారత్‌కు కావాల్సింది భాగస్వాములే కానీ బోధకులు

- మిగతా 2 లో

లోయలో పడ్డ సైనిక వాహనం

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో సైనిక వాహనం అదుపుతప్పి లోయలోకి జారిపోయింది. ఈ దుర్ఘటనలో వాహనంలో ఉన్న ముగ్గురు సైనికులు మృతిచెందారు. చనిపోయిన సైనికులను అమిత్ కుమార్, సుజీత్ కుమార్, మన్ బహదూర్‌గా గుర్తించారు. సైనిక వాహనం పడిన లోయ 700 అడుగుల లోతు ఉంది. ఘటనా స్థలిలో సైనికుల మృతదేహాలతో పాటు వారికి సంబంధించిన కొన్ని వస్తువులు, పత్రాలు దొరికినట్లు సమాచారం. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న సైనిక వాహన శ్రేణిలో ఆ వాహనం ఒక

- మిగతా 2 లో

ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థి ఆత్మహత్య

న్యూదిల్లీ: దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడంలేదు. ఓషియల్ ఇంజినీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్ విద్యార్థి అనికేత్ వాల్కర్ ఆత్మహత్యను మరుగవక ముందే మరో ఘటన జరిగింది. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థి మహమ్మద్ ఆసిఫ్ ఖమర్ ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. క్యాంపస్‌లోని మదన్‌మోహన్ మాలవియా హాల్‌లోగల హాస్టల్ గదిలో ఖమర్ దేహం వేలాడుతూ కనిపించిందని పోలీసు అధికారి చెప్పారు. శనివారం రాత్రి నుంచి గది తలుపులు తెరుచుకోలేదని ఖమర్ మిత్రులు, హాస్టల్ సూపరింటెండెంట్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వృద్ధాప్య నీడలోకి భారత్

- క్షీణిస్తున్న సంతానోత్పత్తి
- తదుపరి పెద్ద సంక్షోభం జనాభానే... ▸ దక్షిణాదిలో సంఖ్య తగ్గుదల
- మోహన్‌దాస్ పాయ్

న్యూదిల్లీ : వృద్ధాప్య జనాభా వైపు భారతదేశ జనాభా మార్పు త్వరలో దాని అత్యంత ముఖ్యమైన సంక్షోభంగా మారవచ్చని ఆరిన్ క్యాపిటల్ చైర్మన్ మోహన్‌దాస్ పాయ్ స్టాన్‌ఫోర్డ్ ఇండియా కాన్ఫరెన్స్ 2025లో తన ముఖ్య ప్రసంగంలో హెచ్చరించారు. కఠినమైన డేటా, దీర్ఘకాలిక అంచనాలను ఉటంకిస్తూ, పాయ్ మాట్లాడుతూ 'భారతదేశంలో అతిపెద్ద సమస్య వృద్ధాప్యం కానుందని' అన్నారు. 'నేడు మనకు 60 ఏళ్లు పైబడిన 130 మిలియన్ల మంది ఉన్నారు. ఇది 200 మిలియన్ల మందికి చేరుకుంటుంది. భారతదేశం చాలా వేగంగా వృద్ధాప్యం అవుతోంది. భారతదేశంలో

- మిగతా 2 లో

యుద్ధం చేస్తే...
వందేళ్లు వెనక్కి

- ప్రాణ, ఆస్తినష్టం తప్ప అభివృద్ధి శూన్యం
- ఉగ్రవాదులను తుదముట్టిస్తే మానవాళికి మేలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

8 లో

'ఆళ్ల' ఆశయ సాధనకు కృషి: కూనంనేని

- జనసందోహం నడుమ అంతిమయాత్ర
- వైద్య కళాశాలకు భౌతికకాయం

2 లో

7న రష్యాకు జిన్‌పింగ్

మాస్కో: రెండవ ప్రపంచ యుద్ధ విజయోత్సవం (విక్టరీ డే) వేడుకల్లో పాల్గొనేందుకుగాను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈనెల 7-10 తేదీల్లో రష్యాలో పర్యటిస్తారని క్రెమ్లిన్ ఆదివారం తెలిపింది. జిన్‌పింగ్ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై అధినేతలు ఇద్దరు చర్చిస్తారని పేర్కొంది. కొన్ని పత్రాలపై సంతకాలు జరుగుతాయని కూడా వెల్లడించింది. సమగ్ర భాగస్వామ్యం, వ్యూహాత్మక సంప్రదింపులు, అంతర్జాతీయ, ప్రాదేశిక ప్రస్తుత పరిణామాలపై రష్యా, చైనా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్, జిన్‌పింగ్ చర్చిస్తారని క్రెమ్లిన్ 'టెలిగ్రామ్'లో తెలిపింది. రెండవ ప్రపంచ యుద్ధంలో 27 మిలియన్ల మందిని సోవియట్ యూనియన్ కోల్పోయింది. అయితే నాజీ దళాలను బెర్లిన్‌కు పరిమితం చేసింది. హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నది అక్కడే. 1945లో రీచ్‌స్టాగ్‌పై అరుణ సోవియట్ విజయ పతాకం ఎగిరింది. కాగా, విక్టరీ డే వేడుకల్లో పాల్గొనేందుకు బ్రెజిల్, సెర్బియా, స్లోవేకియా తదితర దేశాల అధినేతలు రాబోతున్నట్లు క్రెమ్లిన్ పేర్కొంది.

కుల గణనపై విధానం మార్చుకున్నారా?

మోదీకి జైరాం రమేశ్ ప్రశ్న

న్యూఢిల్లీ: కుల గణనపై ఎప్పుడెప్పుడు యూ-టర్న్ తీసుకోవాలా అన్నట్లుగా ప్రధాని మోదీ వైఖరి ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. కుల గణన కోసం డిమాండ్ చేస్తూ అర్బన్ నక్సల్స్ డిమాండ్ అని మోదీ అన్నారని గుర్తు చేశారు. కుల గణన నిర్ణయం దృష్టి మళ్లింపు వ్యూహంలో భాగమన్నారు. 11ఏళ్లకుపైగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కుల గణనపై తమ విధానాన్ని అధికారికంగా మార్చుకుందా? అదే నిజమైతే మోదీ దానిని నిజాయతీగా ఒప్పుకుంటారా? ఈ విధానపరమైన మార్పునకు కారణాలను పార్లమెంటుకు, దేశ ప్రజలకు వివరిస్తారా? కుల గణన నిర్వహణకు గడువును నిర్దేశిస్తారా? అంటూ మోదీకి మూడు ప్రశ్నలను జైరాం రమేశ్ సంధించారు. కుల గణన ప్రకటనపై ఆకస్మికంగా, పూర్తిగా, యూటర్న్ ఎప్పుడెప్పుడు తీసుకోవాలన్నట్లు మోదీ ఆలోచన ఉన్నట్లు విమర్శించారు. కుల గణను మోదీ వ్యతిరేకించడానికి మూడు ఉదాహరణలను వెల్లడించారు. ఏప్రిల్ 28న ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కుల గణన కోసం డిమాండ్‌ను అర్బన్ నక్సల్ డిమాండ్‌గా మోదీ చెప్పడాన్ని జైరాం రమేశ్ గుర్తుచేశారు. ఎస్సీలు, ఎస్టీల గణన మినహా కులాధారిత జన గణన నిర్వహించడం తమ విధానం కాదని 2021, జులై 20న పార్లమెంటుకు ప్రధాని చెప్పారన్నారు. ఎస్సీలు, ఎస్టీలు మినహా మిగతా కులల వారి గణన వివరాలను పొందుపర్చకపోవడం తమ విధానపరమైన నిర్ణయమని 2021, సెప్టెంబరు 21న సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో మోదీ పేర్కొన్నట్లు వెల్లడించారు. ఓబీసీల గణనకు ఆదేశాలివ్వొద్దని సుప్రీంకోర్టును మోదీ ప్రభుత్వం కోరిందని జైరాం రమేశ్ గుర్తుచేశారు.

'ఆళ్ల' ఆశయ సాధనకు కృషి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: సీపీఐ సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు యోధుడు, ప్రముఖ న్యాయవాది ఆళ్ల గురుప్రసాదరావు భౌతికకాయాన్ని ఆదివారం ప్రజల సందర్శనార్థం సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌కు తరలించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కార్యవర్గ సభ్యుడు బి. అయోధ్య, పలువురు ప్రముఖులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు వై. ఉదయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో కూనంనేని మాట్లాడుతూ... గురుప్రసాదరావు ఉత్తమ కమ్యూనిస్టు అని, తుదిశ్వాస విడిచేవరకు ప్రజా సేవకే అంకితమయ్యారని కొనియాడారు. తొలితరం కమ్యూనిస్టుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించారన్నారు. అనేక మందిని నాయకులుగా తీర్చిదిద్ది పార్టీకి అందించారన్నారు. న్యాయవాదిగా పేదలపక్షం వహించారని, మానవతావాదిగా నిస్వార్థ సేవలందించిన ఘనత గురుప్రసాదరావుకు దక్కుతుందన్నారు. ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. గురుప్రసాదరావు ఆశయసాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రాజకీయాలను ప్రభావితం చేసిన వ్యక్తి గురుప్రసాద్ అని, ప్రజాఉద్యమాలతో కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను పెంచిన వ్యక్తి అని కొనియాడారు. ఎలాంటి పదవులను ఆశించకుండా కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి చేశారని చెప్పారు. అనంతరం శేషగిరిభవన్ నుంచి కొత్తగూడెం వైద్య కళాశాల వరకు జనసందోహం నడుమ అంతిమయాత్ర జరిగింది. కుటుంబ సభ్యుల కోరిక మేరకు గురుప్రసాద్ భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధన నిమిత్తం వైద్య కళాశాలకు అప్పగించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, తాటి వెంకటేశ్వర్లు, పాకలపాటి పెద్దబ్బాయి, ప్రముఖ వైద్యులు రమేష్ బాబు, రామ్మోహనరావు, పట్టాభి, లాయర్స్ అసోసియేషన్ నాయకులు లక్కినేని సత్యనారాయణ, రాధాకృష్ణ, కోటం రాజు, ఎల్లంకి వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, జి .వీరాస్వామి, వి. మల్లికార్జున్ రావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, వి. పూర్ణదందర్ రావు, కందుల భాస్కర్, భూక్యా దస్రు, గెద్దాడు నగేష్, కొమారి హన్మంతరావు, మునిగడప వెంకటేశ్వర్లు, రాహుల్, ఫహీమ్, పొలమూరి శ్రీనివాస్, కె.రత్నకుమారి, లిక్కి బాలరాజు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మాకు భాగస్వాములు కావాలి... బోధకులు కాదు

(మొదటిపేజీ తరువాయి)

కాదంటూ యూరప్ తీరును దుయ్యబట్టారు. యూరోపియన్ యూనియన్ భాగస్వామ్యం నుంచి భారత్ కోరుకునేది ఏమిటన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ 'మేము ప్రపంచాన్ని చూసినప్పుడు భాగస్వాముల కోసం వెతుకుతాం. మాకు బోధకులు ముఖ్యంగా సొంతంగా ఆచరించనవి బోధించే వారు అక్కర్లేదు' అని అన్నారు. ఉక్రెయిన్ విషయంలో భారత్ వైఖరితో అంతర్జాతీయ మద్దతును ప్రభావితం చేస్తుందన్న యూరప్ వాదనను జైశంకర్ తిరస్కరిం చారు. చైనాతో సమస్య రావచ్చన్న వాదననూ తోసిపుచ్చారు. చైనాతో భారత్‌కు క్లిష్ట సంబంధాలు ఉన్నాయన్నారు. యూరప్ సమస్యలే మొత్తం ప్రపంచ సమస్యలన్నట్లుగా భావించడాన్ని మానుకోవాలని, ప్రపంచం ఎదుర్కొనే సమస్యలన్నీ యూరప్ సమస్యలు కాబోవని అన్నారు. భారత్-రష్యా సంబంధాలపై మాట్లాడుతూ ఇచ్చిపుచ్చుకునే రీతిలో పరస్పర అవగాహనతో ఈ రెండు దేశాల బంధం ఉందని చెప్పారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వేళ మాస్కోతో న్యూఢిల్లీ సంప్రదింపులు జరపడాన్ని ప్రస్తావించారు. అలాగే రష్యా ముడిచమురు ప్రొక్యూర్‌మెంట్‌నూ పెంచినట్లు జైశంకర్ తెలిపారు.

లారెన్స్ వాంగ్‌కు మళ్లీ పట్టం

సింగపూర్ ప్రధానిగా తిరిగి ఎన్నిక

87 స్థానాల్లో పీఏపీ ఘన విజయం

సింగపూర్: సింగపూర్‌లో సార్వత్రిక ఎన్నికలలో పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) ఘన విజయం సాధించింది. 66 ఏళ్లుగా పరిపాలన సాగిస్తున్న ఈ పార్టీకి సింగపూర్ ప్రజలు మళ్లీ పట్టం కట్టారు. మొత్తం 97 స్థానాలకుగాను 87 స్థానాలను పీఏపీ గెలుచుకుంది. తిరుగులేని మెజారిటీతో మరోమారు అధికారంలోకి వచ్చింది. ప్రధానిగా లారెన్స్ వాంగ్ రెండవ సారి ఎన్నికయ్యారు. శనివారం జరిగిన పోలింగ్‌లో 26 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే రోజు రాత్రి ఓట్ల లెక్కింపు జరిగింది. పీఏపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంది. ఐదు చోట్ల ఎన్నిక ఏకగ్రీవం కాగా 82 చోట్ల పీఏపీ విజయం సాధించింది. దీంతో మొత్తం 87 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. 14వ సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 2,429,281 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 1,240 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగిందని ఎన్నికల సంఘం తెలిపింది. రెండు దశాబ్దాల పాటు లీ సైన్ లూంగ్ ప్రధానిగా ఉన్నారు. ఆయన తప్పుకున్న తర్వాత అంటే గతేడాది మేలో సింగపూర్‌కు నూతన ప్రధాని లభించారు. లారెన్స్ వాంగ్ (52) ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. తన నేతృత్వంలో జరిగిన తొలి ఎన్నికల్లో పట్టు నిరూపించుకున్నారు. పార్టీకి ఘన విజయాన్ని అందించారు. కాగా, ప్రతిపక్ష వర్కర్స్ పార్టీ కేవలం 10 స్థానాల్లో గెలిచింది. 2020 ఎన్నికల్లో పీఏపీకి 61.24 శాతం ఓట్లు రాగా ఈసారి 65.57 శాతం ఓట్లు పోలయ్యాయి. సింగపూర్‌లోని పురాతన- అతిపెద్ద రాజకీయ పార్టీగా పీఏపీ 1965 నుంచి అంటే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అధికారంలో కొనసాగుతోంది.

ప్రజల నమ్మకమే గెలిపించింది: లారెన్స్ వాంగ్

పీఏపీ ఘన విజయం సాధించడంతో వాంగ్ ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తమ ప్రభుత్వానికి సింగపూర్ ప్రజలు స్పష్టమైన మెజారిటీ ఇచ్చారన్నారు. సింగపూర్ సుసంపన్నతకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ పోటీ జరిగింది రాజకీయ పార్టీల మధ్య కాదు... సింగపూర్‌కు, దానికి ఎదురయ్యే సవాళ్లకు మధ్య అని ఆయనన్నారు. దేశంలో క్లిష్ట పరిస్థితులు, ప్రపంచ ఆర్థిక మాంద్యం- అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితుల వేళ జరిగిన ఈ ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడిందని, అందరి దృష్టి ఫలితాలపై ఉందని చెప్పారు. ప్రజలకు తమపై ఉన్న నమ్మకంతోనే తిరిగి గెలుపొందినట్లు వెల్లడించారు. ఒడిదుడుకుల నడుమ సింగపూర్‌కు స్థిరత్వాన్ని ఈ ఫలితాలు ఇస్తాయన్నారు. సుస్థిరత ద్వారా ఉజ్వల భవిష్యత్ దిశగా సింగపూర్ ప్రజలు నమ్మకంగా ముందుకెళ్లగలరని వాంగ్ ఆకాంక్షించారు. తిరిగి అధికారాన్ని కట్టబెట్టిన సింగపూర్ ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

అణ్వస్త్రాల అవసరం రాదనే ఆశిద్దాం: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్-రష్యా మధ్య 2022 నుంచి భీకర పోరు కొనసాగుతోంది. కాల్పుల విరమణ విషయంలో రెండు దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం సాధించిన సందర్భంగా ఈనెల 9న వేడుకలకు రష్యా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఈ పరిస్థితుల్లో దేశ విదేశాల నుంచి వచ్చే అతిథుల భద్రతకు హామీ ఇవ్వలేమంటూ ఉక్రెయిన్ ఓ హెచ్చరిక చేసింది. విజయోత్సవాల దృష్ట్యా ఉక్రెయిన్‌లో మూడు రోజుల కాల్పుల విరమణను పుతిన్ తొలుత ప్రతిపాదించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ మూడు కాదు 30 రోజులైతే ఒప్పుకుంటానన్నారు. అందుకు పుతిన్ ససేమిరా అన్నారు. తమకు కావాల్సినది దీర్ఘకాలిక పరిష్కారమని, తాత్కాలిక విరామం కాదని తేల్చిచెప్పారు. దీంతో జెలెన్‌స్కీ మండిపడుతూ మీ దేశానికి రాబోయే విదేశీ ప్రతినిధుల భద్రతకు హామీ ఇవ్వలేమంటూ మాస్కోను హెచ్చరించారు. ఈ పరిణామాల క్రమంలో పుతిన్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఉక్రెయిన్‌పై అణ్వస్త్రాలు వినియోగించే అవసరం రాదనే ఆశిద్దామన్నారు. 'ఇప్పటివరకు అణ్వాయుధాలు వినియోగించాల్సిన పరిస్థితి రాలేదు... భవిష్యత్‌లోనూ రాదని ఆశిస్తున్నా' అని ఆయన చెప్పారు. ఉక్రెయిన్‌తో పోరునకు లాజికల్ ముగింపు పలికే సత్తా రష్యాకు ఉందన్నారు. 2024 నవంబరులో రష్యా అణు ఒప్పందాన్ని పుతిన్ సవరించిన క్రమంలో అణ్వస్త్రాలను వినియోగించే అవకాశం రష్యాకు ఉంది. మరోవైపు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగిన రష్యా డ్రోన్ల దాడిలో 11 మందికి గాయాలు కాగా, వీరిలో ఇద్దరు పిల్లలు ఉన్నారని ఉక్రెయిన్ అత్యవసర సేవల విభాగం వెల్లడించింది. మొత్తం 165 డ్రోన్లతో రష్యా దాడి చేసిందని, వీటిలో 69ను అడ్డుకోగా, 80 ఎలక్ట్రానికల్లీ జామ్ అయ్యాయని ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. రష్యా రెండు బాలిస్టిక్ క్షిపణులు కూడా ప్రయోగించినట్లు పేర్కొంది. కాగా, 13 ఉక్రెయిన్ డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది.

వృద్ధాప్య నీడలోకి భారత్

(మొదటిపేజీ తరువాయి)

సంతానోత్పత్తి తగ్గుతోంది. భారతీయ మహిళలు గొప్పగా దూసుకుపోతున్నారు' అని చెప్పారు. దేశ వ్యాప్తంగా ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో జనన రేటులో పదునైన తగ్గుదలను ఆయన ఎత్తి చూపారు. ఇన్ఫోసిస్‌లో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా కూడా పని చేసిన పాయ్... దక్షిణ భారతదేశం మొత్తం ఇప్పటికే భర్తీ సంతానోత్పత్తి రేటు కంటే తక్కువగా ఉందని గుర్తించారు. 'భారతదేశంలో జనాభా 0.8 శాతం పెరుగుతోంది. సంతానోత్పత్తి 2.0 కి చేరుకుంది. భర్తీ రేటు కంటే తక్కువ. దక్షిణాది మొత్తం 1.6 శాతం నుంచి 1.7 వరకు ఉంది. 1,000 మంది పురుషులకు 1,020 మంది మహిళలు. భారతదేశంలో పురుషుల కంటే మాకు ఎక్కువ మంది మహిళలు ఉన్నారు' అని వివరించారు. వృద్ధి, సంతానోత్పత్తిలో ప్రాంతీయ తేడాలను ఎత్తి చూపుతూ, జేఎన్‌యూలో కూర్చున్న ఢిల్లీలోని చాలా మంది ప్రజలు డేటాను కూడా చూడరు. ఉపాధి లేకపోవడం గురించి విచారిస్తున్నారు. దక్షిణాదిలో మనకు ఉపాధి కోసం ప్రజలు లేరు. యూపీ ఇప్పుడు అభివృద్ధి చెందుతోంది. అందువల్ల ఉత్తరాది నుంచి ప్రజలు వస్తారు. బీహార్ ఇంకా అభివృద్ధి చెందలేదు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, కేరళ మొదలైన రాష్ట్రాల నుంచి ప్రజలను తీసుకువస్తాము. వారందరూ బెంగళూరు, దక్షిణాదికి పని చేయడానికి వస్తారు. మాకు సిబ్బంది కొరత ఉంది' అని చెప్పారు. లింగం, విద్య విషయాల ధోరణులలో గణనీయమైన తిరోగమనాన్ని పాయ్ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, 'నేడు శుభవార్త. మనకు పాఠశాలలో అబ్బాయిల కంటే ఎక్కువ మంది అమ్మాయిలు ఉన్నారు. చాలా మంది అబ్బాయిలు పాఠశాల నుంచి బయటకు వచ్చే రౌడీ అబ్బాయిలు. ఒకటవ తరగతికి చేరే 100 మంది పిల్లలలో దాదాపు 80 మంది 10వ తరగతి పూర్తి చేస్తారు. 18 నుండి 23 సంవత్సరాల వయస్సులో, కేవలం 28 శాతం మంది మాత్రమే కళాశాలలకు వెళతారు. పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలు పట్టభద్రులు. ఎక్కువ మంది మహిళలు బయటకు వస్తున్నారు.

యూపీ, రాజస్థాన్, మధ్య ప్రదేశ్‌లో ఎక్కువ మంది మహిళలు బయటకు వస్తున్నారు' అని వివరించారు. దక్షిణాదిలో జనాభా తగ్గుదల గురించి కూడా ఆయన హెచ్చరించారు. 'దక్షిణాదిలో జనాభా తగ్గిపోతోంది. 2035 నాటికి తమిళనాడు జనాభా సంపూర్ణ సంఖ్యలో తగ్గడం ప్రారంభమవుతుంది ఎందుకంటే ప్రజలు బాగా చేయవలసిన పనులను మనం చేయడం లేదు' అని పాయ్ అన్నారు.

ములుగు ప్రజల కల సాకారం

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించబోయే నూతన బస్టాండ్‌కు మంత్రులు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం గట్టమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ ర్యాలీగా జిల్లా కేంద్రానికి చేరుకున్న మంత్రులకు గజమాలతో అభిమానులు స్వాగతం పలికారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించా మని, మంగపేట మండలంలో రూ.50 లక్షలతో బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి అవుతున్నాయన్నారు. ఏటూరు నాగారం మండల కేంద్రంలో రూ.7కోట్లతో బస్ డిపో పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ప్రేమనగర్ వద్ద గిరిజన యూనివర్సిటీ, సమీకృత కలెక్టరేట్, వైద్య కళాశాల ఉన్నాయని, సమీపంలో ఎకరం స్థలంలో రూ.45 లక్షలతో నూతన బస్టాండ్ నిర్మాణం జరుగుతుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. మహిళల ఆర్థిక అభ్యున్నతికిగాను మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేసి బస్సు యజమానులుగా చేశామన్నారు. ములుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మంత్రి సీతక్క చొరవ ప్రశంసనీయమని పొన్నం ప్రభాకర్ అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీ చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైందని చెప్పారు. నూతన బస్టాండ్ కోసం నిధులు కేటాయించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ములుగు పర్యాటక ప్రాంతంగా మారడంతో ఎలాంటి పనులకైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. మిస్ వరల్డ్‌లో పోటీ పడుతున్నవారు రామప్పను సందర్శించనున్నారని, అందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని సీతక్క చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాల్మన్ రాజ్, డిప్యూటీ ఆర్ఎంఓ భాను కిరణ్, ఆర్డీవో వెంకటేశ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్, డిపో మేనేజర్లు జ్యోత్స్న, రవి చందర్ పాల్గొన్నారు.

లోయలో పడ్డ సైనిక వాహనం

(మొదటిపేజీ తరువాయి)

భాగమని సైనిక వర్గాలు తెలిపాయి. బ్యాటరీ చష్మా ప్రాంతంలో వాహనం లోయలో పడింది. వెంటనే అక్కడకు చేరుకున్న సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. 'కాన్వాయ్‌లో భాగమైన ఆర్మీ వాహన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్ల ప్రమాదం జరిగింది. వాహనంలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. దురదృష్టవశాత్తు వారు ముగ్గురూ మరణించారు. భద్రతాబలగాలు ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు నిర్వహించాయి. మృతదేహాలను వెలికితీసి పైకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాం. ఘటనాస్థలానికి వెళ్లగా అక్కడ ఒక నట్‌బోల్ట్ కనిపించింది. అది బహుశా స్టీరింగ్ వీల్స్ నుంచి వచ్చి ఉండవచ్చు. కాబట్టి ఆ నట్‌బోల్ట్ కారణంగా డ్రైవర్ స్టీరింగ్ వీల్స్‌పై నియంత్రణ కోల్పోయాడని భావిస్తున్నాం. అదే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా తెలుస్తోంది. దర్యాప్తు తర్వాతే విషయాలు స్పష్టంగా తెలుస్తాయి' అని పోలీస్ అధికారి రంబాన్ కుల్బీర్ సింగ్ వెల్లడించారు.

మోదీ మొండిచేయి

(మొదటిపేజీ తరువాయి)

ఎదురు చూశారు. అయితే అమరావతి రాజధాని నుంచి పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు తదితర అంశాల వరకు ఒక్కదానిపైనా ప్రధాని మోదీ స్పష్టత ఇవ్వలేకపోయారు. రాజధానికి చట్టబద్ధత, విభజన చట్టంలోని ఏపీకి ఇచ్చిన హామీలు ప్రస్తావనకే రాలేదు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల, కడప ఉక్కు నిర్మాణ అంశంపై ప్రధాని స్పందించలేదు. రాజధానితో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులు, హామీలను ప్రధాని ఇవ్వలేకపోయారు. దీంతో ఈ సారి కూడా మోదీ పర్యటనతో ఏపీకి ఆశించినంత ప్రయోజనం లేదన్న విమర్శలున్నాయి. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ప్రసంగిస్తూ... రాజధాని అమరావతి నిర్మాణాన్ని వైసీపీ హయాంలో నీరుగార్చారని, విధ్వంసం సృష్టించారంటూ వైసీపీ పైన, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని మోదీ మాత్రం ఎన్డీఏ కూటమి పార్టీలకు ప్రత్యర్థిగా ఉన్న వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మోదీ ఎలాంటి విమర్శలు చేయలేదు. ఇది కూటమి పార్టీలకు మింగుడుపడటం లేదు. 2015లో రాజధాని ప్రారంభోత్సవానికి వచ్చిన మోదీ... అప్పుడు ముంతడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చారన్న విమర్శలున్నాయి. ఇప్పుడు ఒకే రాజధానికి రెండు సార్లు ప్రధాని ప్రారంభోత్సవాలు చేశారన్న విమర్శలను మోదీ ఎదుర్కొంటున్నారు.

రాజధానికి నిధుల ప్రకటనలో మౌనం

ఒక్క అమరావతి రాజధాని నిర్మాణానికే లక్ష కోట్ల రూపాయల అంచనాలతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఉంది. దానికిగాను ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, కేఎఫ్‌డబ్ల్యు, హడ్కో నుంచి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెస్తోంది. రాజధానికి కేంద్రం నుంచి ఎలాంటి గ్రాంట్ రాకపోవడంతోనే అప్పుల బాటన రాష్ట్రంలోని చంద్రబాబు సర్కార్ ఉంది. మళ్లీ ప్రధాని హోదాలో హాజరయిన మోదీ... చేసిన ప్రసంగంలో రాజధానికిగాని, పోలవరం, ఇతరత్రా అభివృద్ధి పనులకు ఎలాంటి ఆర్థిక సహకార హామీలు ప్రకటించకపోవడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాజధానికి ఇప్పటికే రూ.31 వేల కోట్ల అప్పులు తెచ్చారు. మరో రూ.31 వేల కోట్ల అప్పులు తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది. అసలు రాజధానికి ప్రస్తుతం ప్రభుత్వం వేస్తున్న అంచనాల ప్రకారం లక్ష కోట్ల రూపాయల వరకు వెళ్లే అవకాశం ఉంది. అందులో కేంద్రం నుంచి పెద్దగా సాయం ఏమీలేదు. కేవలం అప్పులు ఇచ్చేందుకే సహకరించారు. రాజధాని నిధులపై కేంద్రం ఇచ్చిన సహకారం ఎంతనే దానిపై వైసీపీ ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావించగా రూ.1,500 కోట్ల గ్రాంట్ మాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు. లక్ష కోట్ల రూపాయలతో నిర్మించాల్సిన అమరావతికి కేంద్రం ఇచ్చే రూ.1,500 కోట్లు ఏ మూలకు వస్తాయనేదీ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో చంద్రబాబు ప్రభుత్వం భారీగా తలపెట్టిన అమరావతి రాజధాని నిర్మాణానికి ఆర్థిక సవాళ్లు ఎదురు కానున్నాయన్న వాదనలు వస్తున్నాయి. కేంద్రం నుంచి ఎలాంటి సహకారం రాకపోతే... వేల కోట్ల అప్పులు వెచ్చించి... రాజధానిని నిర్మిస్తే భవిష్యత్‌లో అది రాష్ట్ర ప్రజలపై తీవ్ర భారం పడే ప్రమాదం ఉంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదు. గతంలో చేసిన సర్వేలన్నీ తప్పుల తడకగా మారాయి. పదేళ్ల నుంచి ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఇంకా 95 వేల కుటుంబాలకు న్యాయం చేయాల్సి ఉంది. కేవలం 11 వేల కుటుంబాలకు అరకొరగానే ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చారన్న విమర్శలున్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ఆర్‌ఆర్ ప్యాకేజీపై ప్రధాని స్పందించలేదు. రెండు రాష్ట్రాలకు సంబంధించిన కేంద్ర స్థాయిలో పరిష్కారానికి నోచుకోని విభజన హామీల అమలుపై మోదీ ఎలాంటి ప్రకటన చేయలేదు. వెనుకబడిన జిల్లాలకు బుందేల్ తరహా ప్యాకేజీపైనా స్పందించలేదు. అన్నిటికంటే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడే ఏపీకి ప్రత్యేక హోదాపై మోదీ మౌనం దాల్చారు. ఇలా ప్రధాని పర్యటనతో అమరావతి రాజధానితో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నిధులు ప్రకటించలేకపోయారు. ఒక్క అమరావతి రాజధానే కాదు... రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధుల సాధన కోసం అన్ని రాజకీయ పక్షాలతో ఐక్యంగా కేంద్రంపై ఒత్తిడి సాధిస్తేనే సాధ్యమవుతుంది.

రైతుల రక్షణ కవచం 'భూభారతి'

(మొదటిపేజీ తరువాయి)

సుజాతనగర్, హనుమకొండలోని నడికుడ, జగిత్యాలలోని బుగ్గారం, జనగాంలోని ఘన్‌పూర్, జయశంకర్ భూపాలపల్లిలోని రేగొండ, జోగులాంబ గద్వాల్‌లోని ఇటిక్యాల్, కరీంనగర్‌లోని సైదాపూర్, కొమరంభీం ఆసిఫాబాద్‌లోని పెంచికల్‌పేట్, మహబూబాబాద్‌లోని దంతాలపల్లె, మహబూబ్ నగర్‌లోని మూసాపేట్, మంచిర్యాలలోని భీమారం, మెదక్‌లోని చిల్పిచిడ్, మేడ్చల్ మల్కాజిగిరిలోని కీసర, నాగర్‌కర్నూల్‌లోని పెంట్లవల్లి, నల్గొండలోని నక్రేకల్, నిర్మల్‌లోని కుంతాల, నిజామాబాద్‌లోని మెండోరా, పెద్దపల్లిలోని ఎలిగేడ్, రాజన్న సిరిసిల్లలోని రుద్రంగి, రంగారెడ్డిలోని కుందుర్గ్, సంగారెడ్డిలోని కొండాపూర్, సిద్దిపేటలోని అక్కన్నపేట, సూర్యాపేటలోని గరిడేపల్లె, వికారాబాద్‌లోని ధరూర్, వనపర్తిలోని గోపాలపేట, వరంగల్‌లోని వర్ధన్నపేట్, యాదాద్రి భువనగిరిలోని ఆత్మకూర్‌లలో భూభారతి అమలు అవుతున్నది.

పాక్ దిగ్బంధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఇచ్చిన ఎమర్జెన్సీ ప్రొక్యూర్‌మెంట్ అధికారాలను వాడి వీటిని కొనుగోలు చేశారు. వాస్తవానికి కొన్ని వారాల క్రితమే ఇవి భారత్‌కు చేరుకున్నాయి. ఈ క్రమంలో సంక్షోభం తలెత్తడంతో ప్రత్యర్థులకు సమాధానం ఇచ్చేందుకు వీటిని సిద్ధం చేస్తోంది. ఈ స్వల్పశ్రేణ క్షిపణులతో ఫైటర్ జెట్ ఎయిర్ క్రాఫ్టులు, ఛాపర్స్, డ్రోన్లను ధ్వంసం చేయవచ్చు. దాదాపు రూ.260 కోట్ల వ్యయంతో వీటిని కొనుగోలు చేశారు. సైన్యం నిఘా సామర్థ్యాలను పెంచడానికి అభివృద్ధి చేస్తున్న స్ట్రాటోస్పిరిక్ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్ తొలి విమాన పరీక్షలను భారత్ విజయవంతంగా నిర్వహించింది. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్‌లో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) ఈ విమాన పరీక్ష చేపట్టింది.

భారత వాయుసేనతో ఘర్షణ జరగొచ్చు: పాక్ రక్షణ మంత్రి

పాక్ రక్షణ మంత్రి ఖవాజ ఆసీఫ్ భారత్ వాయుసేనతో ఘర్షణ జరిగే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అంచనావేశారు. ఆయన పాక్‌కు చెందిన ఏఆర్‌వై న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే తమ గగనతలంలోకి వచ్చేందుకు ప్రయత్నించిన రఫేల్ యుద్ధ విమానాలను అడ్డుకొన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఇక ఇదే మంత్రి మరో ఛానెల్‌లో మాట్లాడుతూ.. సింధు నదిపై భారత్ నిర్మించే కట్టడాన్ని అయినా దాడి చేసి కూల్చేస్తామని పేర్కొన్నారు. అసలు భారత్ దీనిపై నిర్మాణాలకు యత్నించడమే దౌర్జన్యంగా భావిస్తామన్నారు. జియో న్యూస్‌లో మాట్లాడుతూ... 'దౌర్జన్యం అంటే కేవలం తూటాలు కాల్చడమే కాదు.. అది చాలా రూపాల్లో ఉంటుంది. నీటి ఆపటం, మళ్లించడం వంటి కూడా అదే. ఇదే జరిగితే పాక్‌లో ఆకలి చావులను చూస్తాము. వారు ఏదైనా నిర్మాణానికి యత్నిస్తే.. పాక్ దానిని కూల్చేస్తుంది' అంటూ బెదిరింపులకు దిగారు. కాలం గడిచేకొద్దీ భారత్‌తో ఘర్షణలు పెరుగుతాయేకానీ, తగ్గవని ఆయన అభిప్రాయపడ్డారు. పరిస్థితిని సర్దుబాటు చేసేందుకు చాలా దేశాలు యత్నిస్తున్నాయన్నారు.

కరాచీ తీరానికి టర్కీ యుద్ధనౌక

టర్కీకి చెందిన 'టీజీసీ బుయుకడా' అనే భారీ యుద్ధ నౌక కరాచీ తీరాన్ని చేరింది. 2013లో జలప్రవేశం చేసిన ఈ నౌక జలాంతర్గాములకు వ్యతిరేకంగా పని చేయగలదు. గస్తీ కాయడంలో దీనిది అందవేసిన చేయిగా చెబుతారు. వివిధ నౌకాదళ విన్యాసాల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకుంది. పాకిస్థాన్‌కు చెందిన నౌకలకు జలమార్గాలను భారత్ నిషేధించిన సంగతి తెలిసిందే.

ఉన్నత స్థాయి సమావేశానికి పీటీఐ డుమ్మా!

భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో తాజాగా చోటు చేసుకున్న పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించేందుకు ఆర్మీ ఉన్నతాధికారులు, ప్రతిపక్ష పార్టీలతో కలసి ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించింది. చేపట్టబోయే కార్యాచరణ గురించి పాక్ ఆర్మీ అధికారులు.. వివిధ పార్టీల నేతలకు వివరించాలని భావించారు. అయితే, ఈ సమావేశానికి హాజరుకాబోమని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్ ఈ-ఇన్సాఫ్ (పీటీఐ) వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. చాలా కాలంగా ఉగ్రవాదాన్ని పీటీఐ ఖండిస్తోందని, పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ కూడా ఈ విషయంలో తన వైఖరిని అనేక బహిరంగ సమావేశాల్లోనూ నొక్కి చెప్పారని ప్రకటనలో పేర్కొంది.

సస్యశ్యామలం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కాళేశ్వరం కూలిపోయిందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాలను కేటాయించినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ చెరువులన్నింటికీ మరమ్మతులు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇరిగేషన్ శాఖలో ప్రతి సీఈ కింద సుమారు 100 మంది లస్కర్లను అవుట్సోర్సింగ్ పద్ధతిపై నియమించుకునేందుకు కలెక్టర్లకు అధికారాలు ఇచ్చినట్టు చెప్పారు. 1800 పోస్టులను 33 జిల్లాలకు కేటాయించామని తెలిపారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఆర్ అండ్ ఆర్ భూ సేకరణను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని మంత్రి ఆదేశించారు. పౌరసరఫరాలపై సమీక్షిస్తూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా నిలిచిందన్నారు. గత సీజన్లో 66 లక్షలపైబడి ఎకరాలలో 153.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించగా, రబీలో 55 లక్షల ఎకరాలలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి దేశంలోనే రెండు సీజన్లలో 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించిన రాష్ట్రంగా దేశంలోనే ఖ్యాతి గడించామన్నారు. సన్న బియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రాత్మక మార్పు అన్నారు. 84 శాతం జనాభా కు ఉచితంగా మనిషికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యాన్ని ఇస్తున్నామన్నారు. సన్న బియ్యంపై రూ.13 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని వివరించారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బ్రాహ్మణ వెల్లంలో కాలువలను సైతం పూర్తి చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.1,700 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.150 కోట్లు రహదారులకు ఖర్చు పెట్టేలా నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాల పోస్టులన్నింటిని వెంటనే భర్తీ చేయాలని, 15 రోజుల పాటు సన్నబియ్యం అమ్మేలా చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ మంత్రికి ఆయన సూచించారు. సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ... శివన్నగూడెం కింద కిస్టాపురం వరకు కాలువలను పొడగించినట్లయితే ఆ చుట్టుపక్కల ప్రాంతానికి సాగునీరు అందుతుందని, ఎస్ఎల్బీసీ లైనింగ్ కు రూ.442 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, సొరంగం పనులు పూర్తయితే, ఉదయ సముద్రం కింద సుమారు మూడు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు పెరుగుతుందన్నారు. ఆంధ్ర నుంచి వస్తున్న ధాన్యాన్ని నియంత్రించాలని, ముఖ్యంగా ఖమ్మం నుంచి ధాన్యం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డి, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, బాలు నాయక్, సత్యం, రాజగోపాల్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, జయ వీర్ రెడ్డి, శంకర్ నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, శ్రీనివాసరావు, అహ్మద్ హుస్సేన్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, నల్లగొండ జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆర్డీవోలు హాజరయ్యారు.

ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థి ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారన్నారు. ఉదయం క్యాంపస్ అవుట్ పోస్ట్ పోలీసులు గది తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లినట్లు చెప్పారు. బీహార్‌లోని సియోహర్ జిల్లాకు చెందిన ఖమర్ కుటుంబానికి సమాచారం ఇచ్చామన్నారు. ఇది ఆత్మహత్య అని ప్రాథమికంగాలో తేలిందని, లభించిన సమాచారం, ఆధారాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీనియర్ పోలీసు అధికారి చెప్పారు.

జర్నలిస్టుల ఆరోగ్య పథకంపై త్వరలో నిర్ణయం

టీయుడబ్ల్యూజే వినతికి స్పందించిన మంత్రి

విశాలాంధ్ర బ్యూరో – సంగారెడ్డి : జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను తెలంగాణ స్టేట్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు (టీ యు డబ్ల్యూ జే ఐ జే యు) సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వినతి పత్రం సమర్పించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు బందారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు మంత్రిని కలిశారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకం కొద్ది సంవత్సరాలుగా అమలు కావడంలేదని, అందువల్ల అనేకమంది జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు తీవ్ర నష్టం జరిగిందని వివరించారు. తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ పిలుపుమేరకు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వారధిగా ఉన్న జర్నలిస్టులకు సరైన వైద్యం అందించాలని అన్నారు. జర్నలిస్టుల్లో చాలా మంది పేద, మధ్య తరగతి వారే ఉన్నారని తెలిపారు. వైద్యం భారంగా మారిందని మంత్రి దృష్టికి తెచ్చారు. అన్ని ఆస్పత్రుల్లో ఆరోగ్య పథకం అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో తమ యూనియన్ రాష్ట్ర నాయకత్వం విన్నవించిన సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేవలం నిమ్స్ ఆస్పత్రిలో మాత్రమే ఆరోగ్య పథకాన్ని అమలు చేయడం వల్ల, సకాలంలో సరైన వైద్యం లభించడం లేదని పేర్కొన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు, పది పదిహేను రోజుల్లో హైదరాబాదులో ఒక సమావేశాన్ని నిర్వహిస్తామని, దానికి జర్నలిస్టు యూనియన్ నాయకులతో పాటు ఉద్యోగ సంఘాల నాయకులను కూడా పిలిచి చర్చిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని మంత్రి రాజ నర్సింహ తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం అవసరం లేదని అన్నారు. సీనియర్ జర్నలిస్టు పానుగంటి కృష్ణ, ఎన్ టీవీ శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దిక్, రాష్ట్ర హౌసింగ్ కమిటీ సభ్యుడు అన్వర్, దయాళ్, మేఘా రాజ్ నాయక్, ఫోటో జర్నలిస్టులు ఆరిఫ్, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో పేదలకు ప్రాధాన్యతనివ్వండి

విశాలాంధ్ర – ఖమ్మం : ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్నట్లుగా నిరుపేదలకు ప్రాధాన్యతనివ్వాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ కోరారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం మితి మీరుతుందని తద్వారా ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎల్ 1లో ఉన్న పేదలకు సైతం అన్యాయం జరుగుతుందన్నారు. సిపిఐ 29, 30, 33 డివిజన్ల సంయుక్త మహాసభ ఆదివారం త్రీటౌన్లో జరిగింది. మహాసభకు లింగయ్య, అశోక్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పట్టణీకరణ వేగంగా జరుగుతుందని పట్టణంలో మౌలిక వసతుల కల్పన భారంగా మారిందన్నారు. ఖమ్మంజిల్లాకు సంబంధించి మూడింట ఒక వంతు జనాభా ఖమ్మం పట్టణంలోనే కేంద్రీకృతమైందని సురేష్ తెలిపారు. పట్టణ పేదలకు సైతం జాతీయ ఉపాధి హామీ పని అవకాశాన్ని కల్పించాలన్నారు. మున్నేరు రక్షణ గోడల క్రింద స్థలాలు కోల్పోతున్న వారికి తగినవిధంగా పరిహారం చెల్లించాలని సురేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో సమస్యలపై అధ్యయనం చేసి సమస్యల పరిష్కారానికి పోరాట కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. సభలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ -సలాం, పట్టణ నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, సత్యనారాయణ, భూక్యా రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభలో 30వ డివిజన్ కార్యదర్శిగా పల్లెపు లింగయ్య, 29వ డివిజన్ కార్యదర్శిగా నక్కా లింగయ్య, 33వ -డివిజన్ కార్యదర్శిగా ఉడత అశోక్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మహాసభకు ముందు సిపిఐ పతాకాన్ని ఎస్ కె జానిమియా ఆవిష్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

విశాలాంధ్ర-మరిపెడ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఆర్. మధు అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం జిల్లా పరిషత్ పాఠశాల వీరారంలో పదవ తరగతి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి హెచ్ఎం మధు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో వీరారం ప్రభుత్వ పాఠశాల వంద శాతం ఫలితాలను సాధించిందన్నారు. ఉన్నత విద్యార్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయుల చేత బోధన ఉంటుందని, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాం ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదవడం వలన ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు పల్లె ప్రాంతాలకు ప్రగతి రథ చక్రాలాంటివని, పల్లెల్లో అజ్ఞానాన్ని పారదోలి విజ్ఞానాన్ని పంచుతూ వాటి అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన శ్రీకాంత్, నవీన్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి. వెంకట్, పి. అనిల్ కుమార్, యు.వెంకన్న, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన నవ్వుల దినోత్సవం

విశాలాంధ్ర ప్రతినిధి–పెద్దపల్లి, సింగరేణి : ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గోదావరిఖని స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ సభ్యులు వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో 'నవ్వుల నజరానా–హాస్యవల్లరి' నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మేజిక్ రాజా మాట్లాడుతూ కృత్రిమంగా కాసేపు నవ్వినా, ఫీల్ గుడ్ హార్మోన్స్ బాడీలో రిలీజ్ అయ్యి మనిషి ఆరోగ్యంగా ఉంటాడని, నవ్వితే హ్యాపీ.. నవ్వకపోతే బీపీ.. అని వైద్యులు సూచిస్తున్నారన్నారని అన్నారు. నవ్వు ప్రయోజనాలను అందరికీ తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్విహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రపాల్తో పాటు సభ్యులు దయానంద్ గాంధీ, పొన్నం విజయ్కుమార్ గౌడ్, మేజిక్ హరి, మొగరం గట్టయ్య, వై.లెనిన్, ఆశ్రమ నిర్వాహకులు పీటి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భట్టి భూమి పూజ

విశాలాంధ్ర – ఖమ్మం : మధిర పట్టణంలోని వైయస్సార్ విగ్రహం సమీపంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదివారం భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ మధిర పట్టణంలో అండర్ డ్రైనేజ్ ఏర్పాటు కావాలన్నా ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడానికి రూ.128 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. మధిర పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులకు కల్పనకు ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని 128 కోట్లతో చేపట్టామని, వీటికి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిధులు సమ కురుస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో భాగంగా 99.56 కిలో మీటర్ల మేర సీవరేజ్ పైప్ లైన్, 6 వేల 638 గృహాలకు కనెక్షన్, 4 సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. పాత డంపింగ్ యార్డ్ వద్ద రాయపట్నం రోడ్డులో 5 ఎం.ఎల్.డీ ఎస్.టి.పి, మడుపల్లిలో 0.9 ఎం.ఎల్.డీ ఎస్.టి.పి, మధిర లేక్ వద్ద అంబర్ పేటలో 0.4 ఎం.ఎల్.డీ ఎస్.టి.పి, ఇల్లందులపాడు సబ్ రిజిస్టర్ ఆఫీస్ వద్ద 0.5 ఎం.ఎల్.డీ ఎస్.టి.పి నిర్మించడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మధిర పట్టణంలో మేజర్ స్టార్మ్ వాటర్ డ్రైన్, ఆర్.సి.సి రిటైనింగ్ వాల్, ఓ.సి. ఈ.ఎం.ఎస్ పరికరాల అమరిక పూర్తి చేస్తామని, ఈ పనులను రెండు సంవత్సరాల సమయంలో పూర్తి చేయడం జరుగుతుందని, పనులు పూర్తి చేసిన తర్వాత నిర్మాణ సంస్థ 5 సంవత్సరాల పాటు నిర్వహణ చేయాల్సి ఉంటుందని, మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నాణ్యతతో చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నాణ్యత ప్రమాణాలకు ఎక్కడ రాజీ లేకుండా చూడాలని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం వల్ల పట్టణ వాసుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, సీజనల్ వ్యాధుల వ్యాప్తి తగ్గిపోతుందని, పట్టణంలో పారిశుద్ధ్యం, గ్రీనరీ పెరిగేందుకు దోహదం అవుతుందన్నారు. మధిర పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు వెంకట రమణ గుప్తా, మునిసిపల్ కమీషనర్ సంపత్, మధిర తహసీల్దార్ రాంబాబు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

10న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర – గూడూరు: గూడూరు మండల కేంద్రంలో మే 10 వ తేదీన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేయబోతున్నట్లు అంబేద్కర్ కమిటీ చైర్మన్ కత్తి స్వామి తెలిపారు. ఆదివారం ఎట్లా చిన్న కాయలే మండలంలోని అరవింద హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కత్తి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్, పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య. మురళి నాయక్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రియతమా, ఎమ్మెల్సీ పాల్ రెడ్డి, చేసి అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనబోతున్నందున రాజకీయ పార్టీలకు అతీతంగా, ప్రాంతీయ పార్టీల కచ్చితంగా శనివారం నాడుతలపెట్టే కార్యక్రమానికి పలు పార్టీల శ్రేణులు, కార్యకర్తలు గ్రామస్తులు, కుల సంఘ నాయకులు, కుల పెద్దలు కార్యక్రమాన్ని విచ్చేసి విజయవంతం చేయాలని కత్తి స్వామి పిలుపునిచ్చారు. హిందు ఉత్సవ కమిటీ చైర్మన్ పింగిలి శ్రీనివాస్, నూనవత్ రమేష్ నాయక్, సిపిఐ జిల్లా ఉపాధ్యక్షులు నూకల. ఉపేందర్, ఉపాధ్యాయులు రామన్న, గోపి, ఎల్ హెచ్పి నాయకులు రామచందర్, మాల మహానాడు అధ్యక్షులు సిహెచ్ హరీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బోడ ఎల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మందుల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష : కలెక్టర్

విశాలాంధ్ర – కొమరం భీం : రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఎం.బి.బి.ఎస్. ప్రవేశ పరీక్ష కొరకు ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసిందని పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందని, పరీక్ష పూర్తయిన తర్వాత జవాబు పత్రాలను నిబంధనల ప్రకారం పూర్తి బందోబస్తు మధ్య తరలించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షకు 272 మంది హాజరు కాగా 15 మంది అభ్యర్థులు గైరాజరయ్యారని తెలిపారు.

గొల్ల కురుమలకు నగదు బదిలీ అమలు చేయాలి

విశాలాంధ్ర–జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ప్రభుత్వం గొల్ల కురుమలకు 2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడుత గొర్రెల పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని గొల్ల కాపర్ల గ్రామీణ సహకార సంఘాలకు ఎన్నికలు పాత పద్ధతిలోని పశు సమర్ధకశాఖ ద్వారానే ఎన్నికలు జరపాలని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం మహబూబాబాద్ జిల్లా కేంద్రం సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ హాజరై మాట్లాడుతూ, గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేసినట్టే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గొల్ల కురుమలకు 2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా హామీని నెరవేర్చకుండా పాత ప్రభుత్వం అడుగుజాడల్లో నడుస్తుందని ఆరోపించారు. అవినీతి సాకుతో నేటి ప్రభుత్వం గొర్రెలివ్వకుండా డి.డి.ల డబ్బులు రిటర్న్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని, పశువైద్యశాలల్లో ఎలాంటి మందులు అందుబాటులో ఉండటం లేదని, రెండేండ్ల నుండి కనీసం నట్టల మందులు కూడా ఇవ్వటంలేదని అన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తున్న గొర్రెల కాపరులకు ఎక్స్గ్రేషియో ఇవ్వడంలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జి.ఎం.పి.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం అశోక్, జిల్లా నాయకులు కొమ్మనబోయిన యాకయ్య గంధ్రకోటి కుమార్, దూదిమెట్ల మోహన్రావు చిత్తారి సోమన్న, ఆమడగాని రఘు, శ్రీను, తండ మహేష్, గజ్జి మల్లేష్, సత్తి ధోని కొమ్మనబోయిన వెంకన్న, రాజు, దేవన బోయిన మల్లేష్, సోమన బోయిన లింగయ్య, నదునూరి లింగయ్య శంకర్, కొండ రాము, బయ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష : కలెక్టర్

విశాలాంధ్ర – నల్లగొండ బ్యూరో : నీట్ (యూజీ) 2025 ప్రవేశ పరీక్ష నల్గొండ జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాలను ఆమె జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్తో కలిసి తనిఖీ చేశారు. పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రానికి వెళ్లి అక్కడ పరీక్షకు హాజరైన అభ్యర్థులు, గైర్హాజరైన అభ్యర్థుల వివరాలు, ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, తనిఖీలు, ఇతర ఏర్పాట్లను, సౌకర్యాలను ఆమె పరిశీలించడమే కాకుండా, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, నీట్ నోడల్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులతో అడిగి తెలుసుకున్నారు. కాగా నల్గొండ జిల్లాలో నీట్ పరీక్ష కోసం 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2087 మంది అభ్యర్థులను పరీక్ష రాసేందుకు కేటాయించడం జరిగింది. ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షకు 2006 మంది అభ్యర్థులు హాజరు కాగా, 81 మంది గైర్హాజరయ్యారు. 96.1 అభ్యర్థులు నీట్ పరీక్ష రాసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కాగా నీట్ పరీక్ష రాసే అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ప్రధాన గేట్ నుండి పరీక్షా కేంద్రం వరకు వాహన సదుపాయం ఏర్పాటు చేసింది. అంతేకాక ఇంద్రియ విద్యాలయాకి వెళ్లేందుకు కూడా వాహనాలు ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, అదనపు ఎస్పి రమేష్, నల్గొండ ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి, తహసీల్దార్ హరిబాబు, ఇతర అధికారులు ఉన్నారు.

మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సహకరించండి

విశాలాంధ్ర – తొర్రూర్ : మే 20 న దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాలు జరపతలపెట్టిన 23వ సార్వత్రిక సమ్మెకు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమ బిక్షపతి, టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి, సిఐటియు మండల కార్యదర్శి జమ్మల శ్రీనులు కోరారు. మే 20 జరుప తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సహకారం అందించాలని తొర్రూర్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్కు ఆదివారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నోటీస్ ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో 45 కోట్ల మంది కార్మిక వర్గానికి నష్టం తీసుకొచ్చే నాలుగు లేబర్ కోళ్లను ఉపసంహరించి, కార్మిక హక్కులను కాపాడాలని వారు కోరారు. వర్తక, వాణిజ్య, వ్యాపార వర్గాలు సార్వత్రిక సమ్మెకు సహకరించాలని కోరారు. కార్మిక వర్గం శ్రమతో ఉత్పత్తి, ఎగుమతి దిగుమతి లాంటి ముఖ్యమైన కీలక స్థానాలలో పనిచేస్తున్నారని వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కకుండా కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చే లేబర్ కోడ్ తిరస్కరించాలని వారు కోరారు. ప్రతి కార్మికుడికి కనీస వేతనం 26000 ఇవ్వాలని డిమాండ్ ఎంతో న్యాయమైందని వారు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో టీయుసిఐ తొర్రూర్ ఏరియా కమిటీ అధ్యక్షుడు శ్రీరాం పుల్లయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర – నేరేడుచర్ల : తల్లీ, తండ్రీ, గురువు దైవంతో సమానమని అంతటి గురువులను కలుసుకోవడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. నేరేడుచర్ల మండలం పెంచికల్ దిన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-10 సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు బిక్షమయ్య, కరీం, ఉమాశంకర్, చిన్నయ్య, చంద్రశేఖర్, వెంకట్ నారాయణ నాయక్, సువర్ణ, కాటయ్య, వెంకట మహేష్, శ్రీనివాస్, శ్రీను, శంకర్ నాయక్, ఎండి హసీన్, విజయ్ కుమార్, చైతన్య, లక్ష్మారెడ్డి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ వ్యక్తికైనా తల్లిదండ్రులు మొదటి గురువులైతే, విద్యను బోధించిన గురువు రెండవ గురువని, నవ మాసాలు మోసి కనీ పెంచితే, భాహ్య ప్రపంచానికి క్రమశిక్షణ, మంచి నడవడిక ఎలా ఉండాలో తెలియజేసేది గురువు అని, జీవితంలో మరపురాని రూపం బాల్యం అని అలాంటి బాల్యంలో చదువు చెప్పిన గురువులను సన్మానించడం గొప్ప విషయమని అన్నారు. పదిహేను సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు చిరునవ్వులతో, ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో కలసి తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు కుటుంబ నేపథ్యాల విషయాల తెలుసుకొని, ఆనందోత్సాహాలతో గడిపారు. అధ్యాపకులతో పాటు 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పాటుపడేది కాంగ్రెస్ ప్రభుత్వమే : ఎమ్మెల్యే

విశాలాంధ్ర – పినపాక : దేశంలోని అనేక పార్టీల ప్రభుత్వాలు అధికారం చేపట్టి పాలిస్తున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఎప్పటికైనా ప్రజల పక్షం నిలుస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ముఖ్యంగా పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పాటుపడుతుంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తన నియోజకవర్గం పినపాక గతంలోనూ ప్రస్తుతం కూడా అభివృద్ధి సాధిస్తుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటంలో కూడా తమ ప్రభుత్వమే ముందడుగులో ఉంటుందన్నారు. ఆదివారం పినపాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాయం విస్తృతంగా పర్యటించారు. సంక్షేమ పథకాల గురించి ఆయన మాట్లాడుతూ దుష్ప్రచారాలు నమ్మి ఎవరు అధైర్య పడవదన్నారు. అర్హులందరికీ పథకాలు అంది తీరుతాయన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో పూరి గుడిసెలు, రేకులు వేసుకున్న వారు, పరదాలు కట్టుకొని నివసించే వారిని గుర్తించాలని అధికారులకు సూచించారు. పర్యటనలో భాగంగా అశ్వాపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసారు. 16 మందికి రూ. 16,01856, 31 మందికి రూ.12,30000 విలువగల చెక్కులను అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పేద వర్గాలకు అన్ని విధాల న్యాయం జరుగుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం ఎమ్మార్వో స్వర్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య, మండల నాయకులు, మైనార్టీ యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురు ప్రసాదరావు మృతికి న్యాయమూర్తి పాటిల్ సంతాపం

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్ : సీనియర్ న్యాయవాది ఆళ్ల గురు ప్రసాద్రావు భౌతిక కాయాన్ని ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సందర్శించి నివాళులర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురు ప్రసాదరావు అందించిన సేవల గురించి ఎస్కే సాబీర్ భాష, కొందరు న్యాయ వాదులు జిల్లా జడ్జికి వివరించారు. న్యాయవాదిగా కూడా గురుప్రసాదరావు పేదల పక్షం ఎలా పనిచేశారో వివరించారు. పాటిల్ వెంట నివాళులర్పించిన వారిలో కొత్తగూడెం భార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, పోసాని రాధాకృష్ణమూర్తి, సింగరేణి కాలరీస్ లీగల్ అడ్వైజర్ వెల్లంకి వెంకటేశ్వరరావు, చంద్ర నాగేంద్రబాబు, న్యాయవాదుల గుమస్తాలు కే.వెంకటేశ్వరరావు, రాజేష్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఎంపీ రఘురామిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో – ఖమ్మం : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకోవాలని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి అన్నారు. సన్న బియ్యంతో సహా అనేక సంక్షేమ పథకాలు 6 గ్యారంటీల్లోని మెజారిటీ గ్యారెంటీలను అమలు చేస్తున్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో ప్రచారం చేసుకోలేకపోతున్నామని ఆయన అభిప్రాయ పడ్డారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి విస్తృతంగా ప్రభుత్వ అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 68 రోజుల పాటు పార్లమెంటు సమావేశాలు జరిగితే 60 రోజులు పార్లమెంటుకు హాజరై 60 ప్రశ్నలు లేవనెత్తినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటుగా, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతోనూ ఎటువంటి విభేదాలు తనకు లేవని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రి సమస్యలన్నీ పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. పాపటపల్లి నుంచి కొత్త రైల్వే లైను అలైన్మెంట్ వల్ల ఖమ్మం రూరల్ లోని అత్యంత విలువైన భూములు రైల్వే ట్రాక్ పరిధిలో పోతుంటే రైల్వే మంత్రితో అనేక పర్యాయాలు చర్చించి పాత రూటును మార్పించి కొత్తగా అబ్బాయిపాలెం అర్బన్ మీదుగా రైల్వే లైన్ను మార్పించానని ఆయన తెలిపారు. కొత్తగూడెం ఎయిర్ పోర్టు వ్యవహారం గతంలోనే కేంద్ర ప్రభుత్వం పక్కన పెడితే గత బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఆ విషయాన్ని చెప్పలేదని ఎంపీ పేర్కొన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. స్తంభాద్రి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కారం చేయడానికి ఎంపీగా చొరవ తీసుకోవాలని తమకు సహకారం అందించాలని కోరగా తన వంతు సహకారం అందిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. జర్నలిస్టుల రైల్వే పాస్ విషయంపై ఇప్పటికే రైల్వే మంత్రిత్వ మాట్లాడానని పార్లమెంట్లో ఈ అంశాన్ని లేవనెత్తానని ఆయన తెలియజేశారు.

వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



విశాలాంధ్ర – వనపర్తి : వేసవిలో భానుడి ప్రతాపం రోజు రోజుకి తీవ్రరూపం దాల్చి ప్రజలను అనారోగ్యానికి గురయ్యేలా చేస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేటొక ప్రకటనలో తెలిపారు. వేసవికాలం ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్య వడదెబ్బ. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా బయట పనికి వెళ్లే వాళ్లే కాకుండ ఇంట్లో ఉండే వృద్ధులు, పిల్లలు సైతం వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా కొన్ని జాగ్రత్తలు పాటించి వడదెబ్బ తగలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఉదయం నుండి 12 గంటల లోపే బయటి పనులు పూర్తి చేసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకపోవడం మంచిదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లవలసివస్తే నెత్తికి టోపి లేదా గొడుగు వెంట తీసుకువెళ్లాలి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవడం ముఖ్యం. వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. వేసవిలో వడదెబ్బ తగల కుండా ఉండాలంటే ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు తీసుకోవడం, తేలికైన దుస్తులు ధరించడం చాలా ముఖ్యం. వడదెబ్బ లక్షణాలు (తలనొప్పి, వాంతులు, మైకము, అధిక జ్వరం, తల తిరగడం, స్పృహ కోల్పోవడం) కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

సాహితి

ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా...

మనిషిని ఆవిష్కరించిన రవీంద్రుడు

డాక్టర్ జీకేడీ ప్రసాదరావు,
9393111740



ఆంధ్ర విశ్వవిద్యాలయం యవనిక మీద రవీంద్రనాథ్ ఠాగూర్ మనిషిని తాత్త్వికంగా ఆవిష్కరించారు. ప్రపంచ ప్రసిద్ధ నోబెల్ బహుమతిని భారతీయ సాహిత్యానికి ఆభరణంగా తీసుకొచ్చిన మహామనిషి ఆయన. 1913లోనే ఆయన అత్యున్నత పురస్కారాన్ని భారతీయులకు అంకితమిచ్చారు. అందుకే నాడు ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదిక మీద ఆయన ఒక ప్రత్యేక అతిథిగా కూర్చో గలిగారు. అప్పటి ఉపకులపతి డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్ ఆహ్వానం మేరకు రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వచ్చారు. అల్లాడి కృష్ణస్వామి స్మారకోపన్యాసం చేశారు. తాత్త్వికంగా, దైవికంగా 'మనిషి'ని ఆవిష్కరించగలిగారు. తొలి ఉపన్యాసంగా 'మ్యాన్' అనే ఉపన్యాసం చేశారు. ప్రతిమనిషిలోని శాశ్వత మనిషి కోసం మరో రెండు ఉపన్యాసాలు చేశారు. తరువాత వాటిని 'మ్యాన్' అనే పుస్తకంగా సంకలనం చేశారు. ఈ పుస్తకాన్ని మద్రాస్ హాక్సలే ప్రెస్ ముద్రించింది. ఈ ప్రతులు శాంతినికేతన్ గ్రంథాలయంలో వున్నాయి. ఈ ఉపన్యాసాలు శాశ్వత పురుషుడు, సర్వోన్నత పురుషుడు, దైవిక పురుషుడు అనే భావనలతో ఆయన ఉపన్యాసాలు సమాజాన్ని చైతన్యవంతం చేశాయి. నాడు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఉపన్యాసాలు సాంస్కృతిక శోభను తీసుకొచ్చాయి. విద్యలో ఆచరణ, స్వాతంత్ర్యం మీద మక్కువ, విస్తృత విద్యాతత్త్వాన్ని ఆయన రచనలు ప్రతిబింబిస్తాయి. ఠాగూర్ మే 7, 1861న కలకత్తాలో పుట్టారు. అనేక కథలు, పాటలు, నాటకాలు, నవలలు రచించారు. ఆయన నాటకాల్లో కొన్నిపాత్రలు పోషించారు. సెప్టెంబర్ 1912లో లండన్‌లో ఇండియా సొసైటీ తన గీతాంజలి ఇంగ్లీషు అనువాదాన్ని పరిమితంగా ప్రచురించింది. 1913లో ఆయనకు సాహిత్యంలో నోబెల్ బహుమతి లభించింది. ఈ గౌరవాన్ని అందుకున్న తొలి ఐరోపేతర వ్యక్తి. 1915లో కింగ్ జార్జ్ ఆయనకు 'నైట్‌హుడ్ 'బిరుదును ఇచ్చారు. 13 ఏప్రిల్ 1919న జరిగిన జలియన్ వాలాబాగ్ దురంతానికి నిరసనగా 'నైట్‌హుడ్' ను తిరిగిచ్చేశారు. 'గీతాంజలి' విజయంతో ఆయన తన ఇతర రచనల్ని ఆంగ్లంలోకి అనువదించారు. సాహిత్యమే కాకుండా తత్త్వశాస్త్రం, మతం, విద్య, సామాజిక అంశాల మీద ఆయన అనేక వ్యాసాలు, గ్రంథాలు రాశారు. రెండు వేలకు పైగా గేయాలు రాశారు. వాటిలో రెండు భారతదేశం, బంగ్లాదేశ్‌ల జాతీయ గీతాలుగా మారాయి.

రవీంద్రనాథ్ ఠాగూర్, సి.వి. రామన్‌ల సాన్నిహిత్యం ఆంధ్ర విశ్వవిద్యాలయం తొలిదశాబ్దంలో విజ్ఞాన సుగంధాల్ని వెదజల్లాయి. వారిద్దరూ బెంగాల్లో కలుసుకున్నారు. భారతీయ పునరుజ్జీవనోద్యమ భావజాలమే వీరిని కలిపింది. సి.వి. రామన్ తన పందొమ్మిదేళ్ళ వయస్సులోనే ఇండియన్ ఫైనాన్స్ సర్వీస్‌కు ఎంపికయ్యి కలకత్తాలో అసిస్టెంట్ అకౌంట్స్ జనరల్‌గా నియమితులయ్యారు. అదే సమయంలో రామన్‌ని అక్కడి 'ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్'లో పరిశోధనలు చేసుకోవడానికి అనుమతించారు. 1917లో ఈయన కలకత్తా విశ్వవిద్యాలయం రాజాబజార్ అనుబంధ కళాశాలలో ఆచార్యునిగా చేరారు. ఇలా కలకత్తా వేదికగా రవీంద్రునితో అనుబంధం పెరిగింది. సి.వి. రామన్‌కు నోబెల్ బహుమతి నామినేషన్ సమయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆయనకు మద్దతుగా నిలిచారు. రామన్ ప్రభావాన్ని కనుగొనడంతో ఆయనకు 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఈయన నోబెల్ పొందిన తొలి ఆసియావాసి. రామన్ ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి కావడంతో ఇక్కడ ఆనందోత్సాహాలు వెల్లువిరిశాయి. ఈ ఇద్దరూ నోబెల్ గ్రహీతలుగా ప్రపంచ గౌరవాన్ని దక్కించుకున్నారు. సాహిత్యం, విజ్ఞానశాస్త్రాల పట్ల భారతీయులకు గల అంకితభావాన్ని ప్రపంచం ముందు చాటారు. ఇదో అపూర్వఘట్టంగా నాడు ప్రపంచ పత్రికలు కొనియాడాయి.

రవీంద్రనాథ్ ఠాగూర్ 1880లో రాసిన బెంగాలీ నవల 'గోరా' ఆంధ్రదేశాన్ని కదిలించింది. దీనితో ఇక్కడ సాహితీ ప్రియులు ఆయన రచనలతో పెనవేసుకుపోయారు. దీనిని వేంకట పార్వతీశ్వర కవులు తెలుగులోకి అనువదించారు. కాల్పనిక శైలిలో సాగిన ఈ నవలను చాగంటి సత్యనారాయణమూర్తి ప్రచురించారు. విమోచన, సోదరభావం, స్త్రీవాదం, కులం, వర్గం, సంప్రదాయం, ఆధునికత, పట్టణ ఉన్నతవర్గం, గ్రామీణ రైతులు, వలస పాలన, జాతీయవాదాలను విశ్లేషించింది. బ్రహ్మసమాజం తీసుకొచ్చిన సంఘసంస్కరణ ప్రాధాన్యాన్ని ఎలుగెత్తి చాటింది. సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన నవల ఇది.

'మ్యాన్' రచనగా తీసుకొచ్చిన అల్లాడి కృష్ణస్వామి స్మారకోపన్యాసంలో రవీంద్రుని చివరి పంక్తులు ఆలోచనలతో నింపేస్తాయి. "అఖిల జీవులు సుఖముగా ఉండుగాక .. వారికి శత్రువులు లేకుండు గాక .. ఆనందానంద విహారమున విహరించుగాక. జీవజాలమంతా దుఃఖమును విడిచి తగిన హక్కులు అనుభవించుగాక .." అంటారు. ఈ సందర్భంలో తాత్త్వికత నుంచి విధులను, హక్కులను ఆయన గుర్తు చేస్తారు. మనం చేయగలిగేది ప్రార్థన మాత్రమే. దుఃఖాన్ని ఆహ్వానించం కానీ, మరణమూ కలుగవచ్చును, నష్టమూ సంభవించవచ్చును. అయినా సమస్త కాలములోను, సమస్త విశ్వంలోను మనిషి గర్జించును – 'అహం బ్రహ్మాస్మి!' అని ముగిస్తారు. ఇదే సమయంలో విశ్వవిద్యాలయంలో అప్పటి ఉపకులపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ కవిసమ్మేళనం ఏర్పాటు చేశారు. భావకవిత్వ యుగం ముగిసి అభ్యుదయ కవిత్వోద్యమం ముమ్మరంగా నడుస్తున్న రోజులవి. మహాకవి శ్రీశ్రీ, కొంపల్లి జనార్దనరావు వంటి అభ్యుదయ కవులతో కవిసమ్మేళనం వీనులవిందు చేసింది.

రవీంద్రనాథ్ ఠాగూర్ స్వదేశీ విద్య పట్ల ఆసక్తితో వ్యవహరించారు. ఆయన శాంతినికేతన్ ఆంధ్రా సంస్కర్తల మీద తీవ్రప్రభావం చూపింది. ఈ తరహాలో స్వదేశీ విద్యనందించాలనే ఆలోచన ఆ రోజు ఆంధ్ర ఉద్యమ నాయకుల్లో కలిగింది. ఈ తరహాలోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం దిశానిర్దేశం జరిగిందని చెప్పొచ్చు. సి.ఆర్. రెడ్డి సాహితీవేత్తగా రవీంద్రుడిని శ్రద్ధగా అధ్యయనం చేసిన విద్యావేత్త. ఠాగూర్ 'సామాన్య మానవతావాదం' గురించి ఆయన వివిధ వేదికల మీద మాట్లాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రవీంద్రుని రచనల మీద పరిశోధనలు జరిగాయి. ఆయన రచనల్ని అనువాదం చేయడంలోను ఈ విశ్వవిద్యాలయం సముచితపాత్ర పోషించింది. ఆయన 'గోరా' నవల నుంచి అనువదించిన వేంకటపార్వతీశ్వర కవులు పిఠాపురం మహారాజా ఆస్థాన కవులు. ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి భూములు, డబ్బు విరాళమిచ్చిన దాత. ఈ నవలను తెలుగులో ప్రచురించిన చాగంటి సత్యనారాయణమూర్తి ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వవిద్యార్థి.

రవీంద్రుడు ఆగస్టు 7, 1941న తుది శ్వాసవిడిచారు. నాడు యావత్ ప్రపంచం విషాదంలో మునిగిపోయింది. అప్పటి ఉపకులపతి సి.ఆర్. రెడ్డి అధ్యక్షతన ఆంధ్ర విశ్వవిద్యాలయం పెద్ద ఎత్తున సంస్మరణ సభలు నిర్వహించింది. స్వతంత్ర సమరయోధులు న్యాపతి సుబ్బారావు పంతులు ఈ సభల్లో ఉపన్యసించారు. ఆయన అనుబంధం, ఆయన చేసిన సేవ, వేసిన ముద్రను స్మరించారు. గీతాంజలిలో రవీంద్రుడే చెప్పినట్టు ఆయన జీవితం ప్రేమలో త్యాగ భావనతో నిండిపోయింది. గీతాంజలిలో ప్రేమ స్వార్థ రహితంగా, త్యాగరూపంలో వుంటుందన్నారు. ఇది మానవ సంబంధాల్లో వుండాల్సిన నిస్వార్థతకు సూచనగా చెప్పారు. ఆయన అలాంటి జ్ఞాపకాల్నే ఎన్నో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి బహుమతిగా మిగిల్చి వెళ్ళిపోయారు.

(మే 7 రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి - ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా)

1. పైన చిత్రం- 1934 లో కవి సమ్మేళనం నిర్వహించిన సందర్భంలో (కూర్చున్న వారు ఎడమ నుంచి కుడికి) ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రో ఛాన్సలర్ జైపూర్ మహారాజ్ విక్రమ్‌దేవ్ వర్మ, నోబుల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్, వైస్ ఛాన్సలర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, నోబుల్ గ్రహీత సి.వి.రామన్.

2.కింది చిత్రం- ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం- కార్యనిర్వాహక వర్గం 9 డిసెంబర్ 1933 (కూర్చున్నవారు ఎడమ నుంచి కుడికి) జనరల్ కెప్టెన్ తత్రాజీ బహుదూర్, శ్రీమతి చందా, వీసీ సర్వేపల్లి, రవీంద్రనాథ్ ఠాగూర్, గౌరవాధ్యక్షుడు జేసీ కోయాజీ, గౌరవ ఉపాధ్యక్షులు ఎం.వెంకట రంగయ్య, రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రైవేటు కార్యదర్శి శ్రీ చందా. నిలబడిన వారు- 1. బి.సత్య నారాయణ, 2. జి.బి.ఆర్.శర్మ, 3. ఎం.నరసింగరావు, 4. ఎ.శేషగిరిరావు, 5. ప్రెసిడెంట్ సుందరరావు, 6. వి.సుబ్బారావు.

ఒక పిల్లి-మరొక పులి

అప్పుడే పులి కళ్ళలోని క్రౌర్యం
మరుక్షణమే వెనుకడుగు
పిల్లి లాంటి భయకంపిత స్వభావం

ఏక కాలంలో నీ, నా లో
ఒకే ఒరలో భార్యాభర్తల్లా
సర్దుకు సహజీవనం చేస్తుంటాయి

నిన్ను నమ్మి విశ్వాసంతో
కదనరంగంలోకి ముందుకు దూకితే
ముందట ఉన్నోని
మూతి పళ్ళు రాలుతాయి

స్వగతంలో ఒక మాట
వేదికపై ఇంకొక గొంతెత్తే పాట
చెట్టు ఎక్కించి చేతులు విడిచిపెట్టడం

నీకు తెలుసు
నీళ్ళు ఏవో పాలు ఏవో

వాడు నందిని పంది అంటే
వంచుకొని తల ఊపుతావు

వాడు పందిని నంది అంటే
బేరీజు వేసుకొని అవునని చెపుతావు

అగ్రహంగా కుక్క తోక పట్టుకుని
ఉగ్ర గోదావరి ఈదడం వల్ల కాదు

ఒకే సమయంలో
ఒక శత్రువు ఒక మిత్రుడు
నీలో నివసిస్తుంటాడు

తోడు అవుతానని నీడవుతానని
బహిరంగంగా పిలుపు ఇస్తే
పిడికిలెత్తి నిరసన తెలుపలేవు
అడుగు కలిపి ఊరేగింపుతో నడువలేవు

నీ కోపమంతా తాటాకు మంట
ఒకే పొల్లు తాలు పంట

నీలో నాలో ఏకకాలంలో
ఒక పిరికి పిల్లి ఒకానొక గర్జించే పులి
పదును లేని కత్తుల్లా
సహజీవనం చేస్తుంటాయి

తెలిసి జవాబు చెప్పకుంటే
తల వెయ్యి వ్రయ్యలవుతుంది
తెలియక సమాధానం విప్పకుంటే
శవం చెట్టు మీదికి ఎక్కుతుంది

రాజా విక్రమార్కుడు
భుజం మీద శవాన్ని మోయడమే కాదు
ఇప్పుడు బతికున్న శవాల్ని మోస్తున్నాడు

ఒక ధారావాహిక
బేతాళ కథ కొనసాగుతూనేవుంటుంది

జూకంటి జగన్నాథం, 9441078095

పోరితేనే...

మెతుకులు రాలిస్తే
చితుకుల బతుకులు
బాగుపడునా?
అతుకులు
ఎన్నేసిన
గతుకుల రోడ్డున
పయనమే కద...
మారేదెప్పుడు
బడుగు జీవితం
అడుగడుగున
పోరితే తప్ప!!!

కేశవ్ గోపాల్

జాతి పురోభివృద్ధికి సోపానాలు గ్రంథాలయాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వీటి ద్వారానే సమాజ ప్రగతి సాధ్యమని అనేకమంది సాహితీ వేత్తలు, రచయితలు, మేధావులు ఏప్రిల్ 27 ఆదివారం విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యాన జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో అభిప్రాయపడ్డారు. నాలుగు సదస్సుల ప్రణాళికతో ఏప్రిల్ 27 ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రధాన సభ ప్రారంభమైంది. ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ... గ్రంథాలయ ఉద్యమం అంటే ఒక పెద్ద వారసత్వమని పేర్కొన్నారు. గ్రంథాలయాల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథి, అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... వందేళ్ల కిందట గ్రంథాలయోద్యమం జాతీయ ఉద్యమంగా రూపుదిద్దుకుందని, మళ్లీ అలాంటి ఉద్యమమే రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. గ్రంథాలయాల పునర్వికాసంతో పాటు తెలుగు భాషోద్యమానికి నాంది పలకాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో అమరావతిలో అత్యాధునిక గ్రంథాలయాన్ని నిర్మించబోతున్నామని తెలియజేశారు. ఉద్యమ సారథి శివప్రసాద్ మాట్లాడుతూ... కేరళ, కర్ణాటకలో మాదిరిగా రాష్ట్రంలోనూ గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అన్ని సంఘాలు, సంస్థలు, ప్రజలు, మేధావులు అందరినీ కలుపుకొని పునర్వికాసఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళతామన్న ఆశాభావాన్ని వ్యక్తీకరించారు. గ్రంథాలయ శాస్త్ర నిపుణురాలు రావి శారద మాట్లాడుతూ... గ్రంథాలయాలకు పునర్వైభవం దక్కితే సమాజానికి మేలు చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ... స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న పన్నులో 8 శాతం సెస్సు నేరుగా గ్రంథాలయ సంస్థకు చేరేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, డాక్టర్ మధురాంతకం నరేంద్ర, పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ వెన్నా వల్లభరావు, పి.సత్యవతి, అలపర్తి వెంకట సుబ్బారావు, దాసరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'గ్రంథాలయ విజ్ఞానం' వ్యాస సంకలనాన్ని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పరిమి ఆవిష్కరించారు. తొలుత కశ్మీర్ ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.

బడి నుంచే పఠనాసక్తి పెంచాలి... భాషా వికాసానికి పాఠశాల స్థాయి నుంచి గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధి చెందాలని డాక్టర్ మధురాంతకం నరేంద్ర చెప్పారు. 'విద్యా వ్యవస్థలు-గ్రంథాలయాలు' అంశంపై జరిగిన తొలిసదస్సుకు ఆయన అధ్యక్షతవహించారు. ప్రసంగాన్ని కొనసాగిస్తూ... పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో గ్రంథాలయాలను తప్పనిసరి చేయాలని పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యమకారుడు మంచికంటి మాట్లాడుతూ... మాతృభాషలో ప్రాథమిక విద్యాబోధన జరగకపోవడం వల్లే విద్యార్థులు ఆలోచనా పటిమ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో సి.ఎ.ప్రసాద్, జి.ఎస్.చలం, కెంగార మోహన్, దివికుమార్, చలపాక ప్రకాశ్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, జి.లక్ష్మి, టి.మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో బలోపేతం...ఆధునిక సాంకేతికతతో గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయవచ్చని రచయిత పవన్ సంతోష్ చెప్పారు. రచయిత్రి కె.ఎన్.మల్లీశ్వరి అధ్యక్షతన 'సాంకేతిక యుగం-పుస్తక పఠనావశ్యకత' అంశంపై నిర్వహించిన రెండో సదస్సులో సంతోష్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాన్ని ఉపయోగించుకుని రచయితలుగా ఎదిగినవారు ప్రస్తుతం చాలామంది ఉన్నారన్నారు. ప్రొఫెసర్ శ్రీపత్‌రాయ్ మాట్లాడుతూ... ప్రస్తుతం వస్తున్న సాంకేతిక విప్లవంతో ప్రపంచ సమాచారాన్ని ప్రజలు జేబుల్లోనే పెట్టుకోవచ్చని తెలిపారు. షేక్ రహ్మానుద్దీన్ మాట్లాడుతూ... డిజిటల్ గ్రంథాలయాల ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

అభివృద్ధికి నడుం బిగించాలి: గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ చెప్పారు. 'పౌర గ్రంథాలయాలు-సమస్యలు-పునర్నిర్మాణం' అంశంపై జరిగిన మూడో సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు సమస్యలకు నిలయాలుగా మారాయని, వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ... ఈరోజుల్లో పుస్తకాలు చదివే ఓపిక ఎవరికీలేదని, తిరిగి చదవడాన్ని ప్రజలకు అలవాటు చేయాలని సూచించారు. సభలో పౌర గ్రంథాలయ సేవాసమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ, గ్రంథాలయ శాస్త్ర నిపుణుడు ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

జీర్ణ గ్రంథాలను ఉద్ధరించాలి: జీర్ణావస్థకు చేరిన పురాతన గ్రంథాలను తిరిగి ముద్రించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ సీహెచ్. సుశీలమ్మ సూచించారు. 'పౌర గ్రంథాలయాలు-సాహిత్యం ప్రాధాన్యత' అంశంపై జరిగిన ముగింపు సదస్సులో ఆమె మాట్లాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అధ్యక్షత వహించిన సభలో జర్నలిస్టులు రెంటాల జయదేవ, సత్యాజీ, వడ్లమూడి పద్మ పౌర గ్రంథాలయా లతో తమకున్న అనుబంధాన్ని వివరించారు. కవి ఖాదర్ మొహియుద్దీన్, శిఖామణి, మందరపు హైమవతి, ముంజులూరి కృష్ణకుమారి, కె.ఉషారాణి సాహిత్యానికున్న ప్రాధాన్యతను వివరించారు. సదస్సుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ నుంచి దాదాపు 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వీరందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించారు. కె.లక్ష్మయ్య, ఎస్.వెంకటనారాయణ, టి.మనోహర్‌నాయుడు కార్యక్రమాలను సమన్వయపరిచారు.

అలరించిన కళారూపాలు: గ్రంథాలయ ఉద్యమానికి సంబంధించి అనేకమంది కళాకారులు పాటలు, పద్యాలు పాడారు. బుడబుక్కల కథతోపాటు బాబూజీ కళాబృందం 'గ్రంథాలయ ఘనత'పై చెప్పిన బుర్రకథ అందరినీ అలరించింది. కుంచనపల్లి అరవింద హైస్కూల్ విద్యార్థులు లఘు గేయ రూపకాన్ని ప్రదర్శించారు.

తీర్మానాలు ఇవీ...

ఈ సందర్భంగా సదస్సులో అనేక తీర్మానాలు చేశారు.

- గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న వెయ్యికి పైగా పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
- గ్రంథాలయ ఉద్యమ నిర్మాణంలో పాలుపంచుకున్న మహనీయుల పేర్లను పుస్తక భాండాగారాలకు పెట్టాలి.
- అన్ని ప్రాథమిక, ఉన్నతపాఠశాల, కళాశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటుచేయాలి.
- మాతృభాషలో ప్రాథమిక విద్య కొనసాగించాలి.
- గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన పాత బకాయిలను తక్షణమే విడుదల చేయాలి.
- గ్రంథాలయ మంత్రిత్వ శాఖను ప్రత్యేకించి ఏర్పాటుచేయాలి.
- ఇంటర్మీడియెట్‌లో తెలుగును ద్వితీయ భాషగా తప్పనిసరి చేయాలి.
- మాధ్యమిక శిక్షాభియాన్ ద్వారా పుస్తకాలు కొనుగోలు చేయాలి.
- రాజా రామ్మోహన్ లైబ్రరీ ఫౌండేషన్‌కు మ్యాచింగ్ గ్రాంట్స్ ఇచ్చి పుస్తకాలు కొనుగోలు చేయాలి.

'గ్రంథాలయ విజ్ఞానం' వ్యాస సంకలనాన్ని వేదికపై ఉన్నవారితో కలిసి ఆవిష్కరిస్తున్న విద్యావేత్త డాక్టర్ పరిమి

చెన్నాప్రగడ శర్మ, 9440587567

పాక్ మహిళతో రహస్యంగా పెళ్లి

విధులనుంచి సీఆర్‌పీఎఫ్ జవాన్ తొలగింపు

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు చెందిన మహిళను రహస్యంగా వివాహమాడి... నిబంధనలకు విరుద్ధంగా ఆమెను రహస్యంగా ఉంచినందుకు సీఆర్‌పీఎఫ్ జవాన్‌పై వేటు పడింది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్ జాతీయులు దేశం వీడి వెళ్లాలని భారత్ ఇటీవల ఆదేశాలు జారీ చేయగా... అసలు విషయం వెలుగుచూసింది. సీఆర్‌పీఎఫ్ 41వ బెటాలియన్ జవాన్ మునీర్ అహ్మద్ గతేడాది మే నెలలో పాకిస్థాన్‌కు చెందిన మహిళను వీడియో కాల్ ద్వారా వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమె వీసాపై భారత్‌కు వచ్చింది. అయితే, ఈ విషయాన్ని మునీర్ ఉన్నతాధికారులకు చెప్పలేదు. పైగా వీసా గడువు ముగిసినా ఆమె భారత్‌లోనే ఉంటోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ పౌరుల అన్ని రకాల వీసాలను భారత్ రద్దు చేసింది. ఈ క్రమంలోనే జవాన్ భార్యకు కూడా భారత్ నుంచి వెళ్లిపోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆమె జమ్ముకశ్మీర్ హైకోర్టును ఆశ్రయించింది. దేశం విడిచిపెట్టి వెళ్లే చివరి క్షణంలో హైకోర్టు స్టే విధించింది. ఈ క్రమంలోనే ఆమె వివరాలు ఆరా తీయగా... అసలు విషయం గుట్టురట్టయ్యింది. దీంతో ఉన్నతాధికారులు మునీర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. "పాక్ జాతీయురాలితో వివాహం జరిగిన విషయాన్ని దాచిపెట్టాడు. అంతేకాకుండా ఆమె వీసా గడువు ముగిసిందని తెలిసి కూడా ఆశ్రయం కల్పించినందుకు తక్షణమే సర్వీసు నుంచి తొలగిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించడం, జాతీయ భద్రతకు విఘాతం కలిగేలా ప్రవర్తించినందుకు ఈ మేరకు చర్యలు తీసుకున్నాం' అని సీఆర్‌పీఎఫ్ ప్రతినిధి తెలిపారు.

ప్రధాని మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ సమావేశమయ్యారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ సమావేశం జరిగింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. శనివారం నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠీ కూడా ప్రధానిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు ఈ భేటీలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. లక్ష్యాలు, దాడి సమయం అవి నిర్ణయిస్తాయని నాడు సీసీఎస్ వెల్లడించింది. ఇక శుక్రవారం సన్నద్ధతలో భాగంగా యూపీలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది. 2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత్ వాయుసేన పాక్‌లోకి ప్రవేశించి దాడి చేసింది. నాటితో పోల్చుకొంటే రఫేల్ యుద్ధ విమానాలు, ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో ఐఏఎఫ్ శక్తి గణనీయంగా పెరిగింది.

తెరచుకున్న బద్రీనాథ్ ఆలయం

డెహరాడూన్: ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ క్షేత్రం 'ఓం నమో నారాయణాయ' అష్టాక్షరీ మంత్ర స్మరణతో మార్మోగింది. వేద మంత్రోచ్చారణలు, వాయిద్యాలు నడుమ ఆలయ ద్వారాలు ఆదివారం ఉదయం తెరచుకున్నాయి. దీంతో శ్రీమహావిష్ణువును దర్శించుకునేందుకు తరలివచ్చిన అశేష భక్తజనులు పులకించిపోయారు. చార్‌ధామ్ యాత్రలో భాగంగా ఇప్పటికే కేదార్‌నాథ్ ఆలయాన్ని తెరిచారు. తొలిరోజు 30 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారు. కాగా, జై బద్రీనాథ్ విశాల్ అంటూ లక్షలాది మంది భక్తుల జపిస్తుండగా... గర్వాల్ రైఫిల్స్‌కు చెందిన ఇండియన్ ఆర్మీ భక్తి సంగీతాన్ని వాయిస్తుండగా ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. తొలుత ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామీ దేవాలయంలోకి ప్రవేశించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... చార్‌ధామ్ యాత్ర సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భారీగా భద్రతా దళాలను మోహరించినట్లు చెప్పారు. 40 క్వింటాళ్ల పూలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా దేవాలయ పరిసర ప్రాంతాల్లోని భక్తులపై పూల వర్షం కురిపించారు. ఉదయం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది నవంబర్ వరకు ఆలయం తెరిచే ఉంటుంది. గత శీతాకాలంలో ఆలయాన్ని మూసివేశారు. మళ్లీ 6 నెలల తర్వాత తిరిగి దేవాలయ తలుపులు తెచరుకున్నాయి.

ఇమ్రాన్ ఖాన్... భుట్టో 'ఎక్స్' ఖాతాల నిలిపివేత

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గత నెల 22న పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాక్‌పై భారత్ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా తాజాగా పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆదేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో ఎక్స్ ఖాతాలను నిలిపివేసింది. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అధికారిక ఎక్స్ ఖాతాను కూడా బ్లాక్ చేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇటీవల పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్ ఎక్స్ ఖాతా నిలిపివేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్‌పై వారు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న కారణంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న వివిధ యూట్యూబ్ ఛానళ్లు, న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ మీడియాకు చెందిన 16 ఛానళ్లపై వేటు వేసింది. పహల్గాం ఉగ్రదాడిపై ఇటీవల ఇమ్రాన్ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ...ఇది చాలా విషాదకర సంఘటన అన్నారు. కశ్మీర్ విషయంలో భారత్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రేలాపనలు చేశారు. ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ పాక్‌పై దాడులకు దిగితే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. పాక్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో సైతం... సింధూ నదిలో నీరు పారకపోతే.. రక్తం పారుతుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధూ నది తమదేనని, ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని వీడేవరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలని భారత్... వివిధ కీలక నిర్ణయాలు తీసుకుంది.

బాగలిహార్ ఆనకట్ట గేట్ల మూసివేత

ఆగిన నీటి సరఫరా

పాక్‌కు భారత్ షాక్

శ్రీనగర్: సింధు నదీ జలాలు పాక్‌లోకి వెళ్లకుండా చేసేందుకు భారత్ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా బాగ్‌లిహార్ ఆనకట్ట నుంచి పాక్‌కు నీటి సరఫరాను నిలిపివేసింది. నీటి ప్రవాహాన్ని ఆపేందుకు ఈ ఆనకట్ట స్లూయిస్ స్పిల్‌వేపై ఉన్న గేట్లను కిందకు దించేశారు. దీంతో పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు ఇక్కడ నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇది స్వల్పకాల చర్యగా అక్కడి అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో అవసరమైతే భారత్ కఠిన చర్యలు తీసుకోగలదని పాక్‌కు తెలియజేసినట్లయిందన్నారు. 900 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి నిమిత్తం ఈ ఆనకట్టను చీనాబ్ నదిపై 2008లో నిర్మించారు. దీని పొడవు దాదాపు 145 మీటర్లు. సింధు జలాల ఒప్పందం కింద పాక్‌కు అత్యధిక వాటా నీళ్లు లభించిన నదుల్లో చినాబ్ కూడా ఒకటి. పంజాబ్ ప్రావిన్స్‌లో ఎక్కువగా పంటపొలాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి. ఉగ్రదాడి జరిగిన తర్వాత ఏప్రిల్ 26న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపేసింది. ఆ తర్వాత 29 నాటికే ఈ డ్యామ్ నుంచి పాకిస్థాన్‌కు వెళుతున్న జలాలు నిలిచిపోయినట్లు ఉపగ్రహ చిత్రాలు బయటకు వచ్చిన సంగతి విదితమే. పాక్‌లోని సియోల్‌కోట్ వద్దకు వచ్చేసరికి చీనాబ్ పూర్తిగా ఎండిపోయింది. పాక్‌లోని పంజాబ్‌లో పత్తి, వరి సాగుకు ఈ నీరు చాలా అవసరం. ఇక గత వారం జీలం నది వరద ప్రవాహం పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను భయపెట్టింది. అక్కడి ముజఫరాబాద్ సమీపంలో గత వారం జీలం నదిలో నీటి మట్టం ఒక్కసారిగా కొన్ని అడుగులు పెరిగిపోయింది. దీంతో స్థానిక అధికారులు హట్టియాన్ బాలా అనే ప్రాంతంలో ఎమర్జెన్సీ ప్రకటించాల్సి వచ్చింది. ముజఫరాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఇది ఉంది. ప్రజలను నదీ తీరంలోకి వెళ్లొద్దని మసీదుల నుంచి హెచ్చరించారు. ఈ నది అనంతనాగ్ జిల్లా మీదుగా ప్రవహించి చకోథి ప్రాంతంలో పీఓకేలోకి చేరుతుంది.

రష్యా క్షిపణుల దిగుమతి

పాక్‌తో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ తాజాగా రష్యా నుంచి ఇగ్లా-ఎస్ క్షిపణులను దిగుమతి చేసుకుంది. అత్యవసర సందర్భాల్లో ఆయుధ సేకరణగా ఆర్మీ ఈ స్వల్పశ్రేణి క్షిపణులను దిగుమతి చేసుకుంది. వీటితో భారత గగనతల రక్షణ వ్యవస్థ మరింత పటిష్ఠం కానుంది. ఆర్మీకి చెందిన గగనతల రక్షణ వ్యూహాలకు ఈ క్షిపణులు కీలకమని రక్షణరంగ నిపుణులు చెబుతున్నారు. కొన్ని వారాల క్రితం వీటిని దిగుమతి చేసుకున్న ఈ క్షిపణులను ఇప్పటికే సరిహద్దు వద్దకు తరలిస్తున్నారు. మొత్తం రూ.260 కోట్ల విలువైన క్షిపణులను ఆర్మీ దిగుమతి చేసుకుంది. వీటిని పశ్చిమ సెక్టర్‌లో మోహరిస్తున్నారు. ఫైటర్ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్ల నుంచి ఈ క్షిపణులు రక్షణ కల్పిస్తాయని రక్షణ వర్గాలు తెలిపాయి.

భారత్ వద్ద ఇప్పటికే ఉన్న ఇగ్లా క్షిపణుల అత్యాధిక వర్షెన్ ఇగ్లా-ఎస్. తాజా వర్షన్ మిసైళ్లను దిగుమతి చేసుకోవడంతో పాటు మునుపటి మిసైళ్లను భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో తాజాపరిచింది. ప్రస్తుతం భారత్‌కు గగనతల రక్షణ కోసం ఇలాంటి మిసైళ్ల అవసరం ఉందని...వీటితో పాటు డ్రోన్లను గుర్తించి, నాశనం చేయగలిగే ఆయుధాల అవసరం కూడా ఉందని తెలిపాయి.

ప్రముఖ యోగా గురువు శివానంద స్వామి కన్నుమూత

న్యూఢిల్లీ: ప్రముఖ యోగా గురువు, పద్మశ్రీ అవార్డు గ్రహీత శివానంద స్వామి (128) కన్నుమూశారు. వారణాసిలోని తన నివాసంలో స్వామి తుదిశ్వాస విడిచినట్లు ఆయన సన్నిహితులు వెల్లడించారు. 1896 ఆగస్టు ఎనిమిదో తేదీన అవిభక్త భారత్‌లోని సిల్హెట్ జిల్లాలో నిరుపేద కుటుంబంలో ఆయన జన్మించారు. ప్రస్తుతం సిల్హెట్ జిల్లా బంగ్లాదేశ్‌లో ఉంది. శివానంద స్వామికి ఆరేళ్ల వయసులోనే ఆయన తల్లిదండ్రులు చనిపోయారు. దాంతో ఆయన పశ్చిమ బెంగాల్‌లోని ఓ ఆశ్రమంలో పెరిగారు. గురు ఓంకారానంద గోస్వామి ఆయనను పెంచి పెద్ద చేయడమేగాక, యోగా వంటి ఆధ్యాత్మిక విషయాలను బోధించారు. ఈ క్రమంలోనే తన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేసిన స్వామి శివానంద... గత 50 ఏళ్లుగా పూరిలో సుమారు 600 మంది కుష్టు రోగులకు సేవచేశారు. యోగా రంగానికి ఆయన చేసిన కృషికిగాను 2022లో అప్పటి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా శివానంద పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. తెల్లటి ధోవతి, కుర్తా ధరించి.. కాళ్లకు చెప్పులు లేకుండా అత్యంత సామాన్యంగా వచ్చి ఆయన పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించడం అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించింది.

ప్రధాని మోదీ సంతాపం

యోగా గురువు స్వామి శివానంద మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. శివానంద మృతి తనను చాలా దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. స్వామి ఆధ్యాత్మిక సాధన, యోగా రంగానికి ఆయన చేసిన అసమానమైన కృషి తరతరాలకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. యోగా ద్వారా ఆయన చేసిన సమాజసేవకు గుర్తింపుగా పద్మశ్రీ అవార్డు కూడా అందుకున్నారని గుర్తుచేశారు. స్వామీజీకి హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా స్వామీజీ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

ముస్లింలు, కశ్మీరీలపై దాడులకు సీపీఎం ఖండన

న్యూఢిల్లీ : పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడి నేపథ్యంలో ముఖ్యంగా ముస్లింలు, కశ్మీర్ స్థానికులపై దాడి, వేధింపులను సీపీఎం ఆదివారం ఖండించింది. ప్రతీకార చర్య ఉగ్రవాదుల అజెండాను మరింత ముందుకు తీసుకువెళుతోందని, ప్రజలలో విభజనను సృష్టిస్తోందని ఆ పార్టీ పేర్కొంది. 'సోషల్ మీడియాలో ముస్లింలు, కశ్మీరీలపై జరుగుతున్న ద్వేషపూరిత ప్రచారాన్ని, వ్యక్తిగత పౌరులపై కొన్ని దాడులను పొలిట్ బ్యూరో ఖండించింది. ఇటువంటి మతోన్మాద శక్తులు ప్రజలను విభజించాలనే ఉగ్రవాద లక్ష్యానికి మాత్రమే సహాయపడతాయి' అని శనివారం జరిగిన పొలిట్ బ్యూరో సమావేశం తర్వాత పార్టీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. దక్షిణ కశ్మీర్‌లోని ఒక ప్రసిద్ధ పర్యాటక ప్రాంతంలో 26 మంది పర్యాటకులను కాల్చి చంపిన సంఘటనను 'ఒక పెద్ద భద్రతా లోపం'గా అభివర్ణిస్తూ దాడి చేసిన వారిని గుర్తించి, అంతర్జాతీయ సమాజం ముందు ఉంచడానికి ఒక పత్రాన్ని సిద్ధం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యత అని సీపీఎం తెలిపింది. తగిన జోక్యం కోసం ఈ విషయాన్ని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) దృష్టికి తీసుకువెళ్లాలని పేర్కొంది. పర్యాటకులను ఉగ్రవాదులు చంపిన తర్వాత కశ్మీరీలు చేసిన నిరసన... ఖండన 'అత్యంత ముఖ్యమైన సంఘటన' అని సీపీఎం తెలిపింది. వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 అమలులోకి వచ్చిన తర్వాత వివిధ నగరాల్లో ముస్లింలపై జరిగిన దాడులను కూడా పార్టీ తన ప్రకటనలో ప్రత్యేకంగా ప్రస్తావించింది. కేంద్రంలోని అధికార పార్టీ బీజేపీ ప్రజలను మతపరంగా విభజించడానికి, మైనారిటీలపై దాడి చేయడానికి ఈ బిల్లును ఉపయోగిస్తోందని ఆరోపించింది. 'వక్ఫ్ సవరణ బిల్లు తర్వాత చర్చి యాజమాన్యంలోని ఆస్తులపై దృష్టి పెట్టాలని కొందరు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఇది మైనారిటీ వర్గాల ఆస్తులను స్వాధీనం చేసుకుని, రాజ్యాంగబద్ధంగా హామీ ఇవ్వబడిన హక్కులు, రక్షణను హరించాలనే వారి నిజమైన ఉద్దేశ్యాన్ని వెల్లడిస్తుంది' అని తెలిపింది. ముస్లిం ఉగ్రవాద సంస్థలు పరిస్థితిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని, హిందూత్వ మతతత్వ శక్తుల చేతుల్లోకి చొరబడుతున్నాయని పార్టీ పేర్కొంది. కుల గణన చాలా కాలంగా డిమాండ్ చేస్తున్న సానుకూల నిర్ణయమని, అలాగే ప్రభుత్వం వెంటనే సాధారణ జనాభా గణన నిర్వహణ కోసం షెడ్యూల్‌ను ప్రకటించాలని సీపీఎం పేర్కొంది.

సైనిక సమాచారం చేరవేస్తున్న ఇద్దరి అరెస్ట్

న్యూఢిల్లీ: భారత సైనిక దళాల కదలికలకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారం, ఫొటోలను పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఇద్దరు వ్యక్తులను పంజాబ్‌లోని అమృత్‌సర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. పాలక్ షేర్ మసిహ్, సూరజ్ మసిహ్‌లుగా వీరిని గుర్తించారు. వీరు పాక్‌లోని ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌లతో సంబంధం కలిగిఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక దర్యాప్తు సమాచారం ప్రకారం హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ పిట్టు అలియాస్ హ్యాపీ సూచనల మేరకు వీరు పని చేస్తున్నట్లు తేలింది. ప్రస్తుతం హర్‌ప్రీత్ సింగ్ అమృత్‌సర్ జైల్లో ఉన్నాడు. వీరి వద్ద అత్యంత సున్నితమైన విజువల్స్‌తోపాటు, డేటా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అధికార రహస్యాల చట్టం కింద వీరిపై కేసులు పెట్టారు. దర్యాప్తు సాగే కొద్దీ మరిన్ని అరెస్టులు ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు.

10, 12వ తరగతి ఫలితాలపై వదంతులు నమ్మొద్దు: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల విడుదలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని సీబీఎస్ఈ విజ్ఞప్తి చేసింది. ఈ నెల ఆరోతేదీ ఉదయం 11 గంటలకు సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాలు విడుదల చేస్తున్నట్లు బోర్డు పేరిట సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ఓ లేఖను ఖండించింది. ఆ లేఖ నకిలీదని, దాన్ని సీబీఎస్ఈ విడుదల చేయలేదని స్పష్టం చేసింది. బోర్డు ఫలితాల విడుదలకు సంబంధించి అధికారిక ప్రకటన ఏదీ తాము విడుదల చేయలేదని బోర్డు స్పష్టం చేసింది. ధృవీకరణ కాని వార్తలను షేర్ చేయవద్దని, సరైన సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్ ఎఎంవ.స్తశీజ.ఱఅను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులను కోరింది. మన దేశంలో 7,842 కేంద్రాలతో పాటు 26 దేశాల్లో నిర్వహించిన సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలకు దాదాపు 42లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 24.12 లక్షల మంది పదో తరగతి పరీక్షలు, 17.88 లక్షల మంది 12వ తరగతి పరీక్షలు రాశారు.

నిఘా మరింత పటిష్టం

డీఆర్‌డీఓ పరీక్ష విజయవంతం

షియోపూర్ (మధ్యప్రదేశ్): సైన్యం నిఘా సామర్థ్యాలను పెంచడానికి అభివృద్ధి చేస్తున్న స్ట్రాటోస్ఫిరిక్ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్ తొలి విమాన పరీక్షలను భారత్ విజయవంతంగా నిర్వహించింది. మధ్యప్రదేశ్‌లోని షియోపుర్‌లో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) ఈ విమాన పరీక్షను చేపట్టింది. 62 నిమిషాల పాటు నిర్వహించిన ఈ పరీక్షకు సంబంధించిన దృశ్యాలను డీఆర్‌డీఓ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. స్ట్రాటోస్ఫిరిక్ ఎత్తులలో చాలా కాలం పాటు గాలిలో ఎగరగలిగేలా ఈ ఎయిర్‌షిప్‌ను రూపొందించినట్టు అధికారులు చెప్పారు. గాలి కంటే తేలికైన అధిక-ఎత్తు ప్లాట్‌ఫామ్ వ్యవస్థల సాక్షాత్కారానికి ఈ ప్రోటోటైప్ విమానం ఒక మైలురాయి అని పేర్కొన్నారు. ప్రపంచంలో చాలా తక్కువ దేశాలు మాత్రమే ఇంత సంక్లిష్టమైన వేదికను అభివృద్ధి చేశాయని అధికారులు తెలిపారు. ఈ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌ను దాదాపు 17 కిలోమీటర్ల ఎత్తుకు ఇనుస్ట్రుమెంటల్ పేలోడ్‌తో ప్రయోగించారు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ విమాన పరీక్ష జరిగింది. ఈ వ్యవస్థ తొలి విమాన పరీక్ష విజయవంతం అయినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీఓను అభినందించారు. భారత నిఘా సామర్థ్యాలను ఈ ఎయిర్‌షిప్ వేదిక మెరుగుపరుస్తుందని చెప్పారు.

వాణిజ్య నౌకలకు హెచ్చరిక

వాణిజ్య నౌకలకు భారత నౌకాదళ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అరేబియా సముద్రంలో భారత నావికాదళం విన్యాసాలు కొనసాగుతున్నందున జాగ్రత్తగా ఉండాలని నావిగేషన్ వార్నింగ్‌లు జారీ చేశారు.

కాంగ్రెస్, రాహుల్ హిందూ వ్యతిరేకులు

బీజేపీ నేతల ప్రేలాపన

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత ఉన్న రాహుల్ గాంధీ అమెరికాలో శ్రీరాముడి ఉనికి గురించి చేసిన వ్యాఖ్యలను బీజేపీ వివాదాస్పదం చేయడానికి యత్నిస్తోంది. అమెరికాలోని ఒక యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ...'రాముడు పురాణాలకు చెందిన వ్యక్తి'గా అభివర్ణించారు. అయితే దీనిపై బీజేపీ నేతలు భగ్గుమంటున్నారు. రాహుల్ గాంధీ హిందూ వ్యతిరేక మనస్తత్వం కలిగిన వాడని అవాకులు చవాకులు పేలుతున్నారు. బ్రౌన్ యూనివర్సిటీలోని వాట్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. "మన పురాణాల్లోని రాముడు క్షమించే గుణం కలవాడని, బీజేపీ చెప్పేది హిందూ ఆలోచన అని నేను అస్సలు పరిగణించను. హిందూ ఆలోచన అంటే నేను బహుత్వవాదం, ఆలింగనం చేసుకోవడం, ఎక్కువ అప్యాయత, ఎక్కువ సహనం. ప్రతీ దేశంలో అలాంటి ఆలోచన కోసం నిలబడి, జీవించి, ఆ ఆలోచన కోసం మరణించిన వారిని చూశాము. గాంధీ వారిలో ఒకరు." అని రాహుల్ గాంధీ అన్నారు. బీజేపీ భావనను తాను హిందూ భావనగా చూడనని స్పష్టం చేశారు. అయితే, ఈ ఇంటర్వ్యూ లోని ఒక క్లిప్‌ని బీజేపీ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా 'ఎక్స్' లో రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. 'హిందువులను, రాముడిని అవమానించడం కాంగ్రెస్ పార్టీ గుర్తింపుగా మారింది. అఫిడవిట్ ద్వారా రాముడి ఉనికిని తిరస్కరించిన వారు, రామమందిర నిర్మాణాన్ని వ్యతిరేకించిన వారు, హిందూ ఉగ్రవాదం అనే పదబంధాన్ని సృష్టించిన వారు ఇప్పుడు రాహుల్ గాంధీని 'పౌరాణికం' అని అన్నారు. రాహుల్ గాంధీ,సోనియా గాంధీ రామమందిర ప్రతిష్ఠకు హాజరు కాలేదు. ఇది వారి రామ వ్యతిరేక, హిందూ వ్యతిరేక మనస్తత్వాన్ని చూపిస్తుంది. వారు పాకిస్థాన్ భాషను మాట్లాడతారు. సైన్యం నైతికతను దెబ్బతీస్తారు. వారు రాముడికి వ్యతిరేకులు,భారతదేశ వ్యతిరేకులు, ప్రజలు దీనిని క్షమించరు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి మాట్లాడుతూ... కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అని మండిపడ్డారు.

మరో అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్, 2007లో రాముడికి చారిత్రక రుజువులు లేవని కాంగ్రెస్ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన విషయాన్ని ఎత్తిచూపారు. రాముడు ఏ ఇంజనీరింగ్ కళాశాలలో చదివాడో లేదా ఆయన ఏ వంతెనను నిర్మించాడో తెలిపే చరిత్ర లేదని కాంగ్రెస్ మిత్రపక్షం డీఎంకే రాముడిని ఎగతాళి చేసిందని చెప్పుకొచ్చారు.

సంపన్నుల్లోనే సామాజిక బాధ్యత అధికం

న్యూఢిల్లీ: సామాజికంగా, ఆర్థికంగా తక్కువ స్థాయిలో ఉన్నవారితో పోలిస్తే అధిక ఆదాయం, ఆర్థికంగా పైస్థాయిలో ఉన్నవారిలోనే సామాజిక బాధ్యత అధికంగా ఉంటుందని ఓ తాజా అధ్యయనంలో వెల్లడైంది. పీఎన్ఏఎస్ నెక్సస్ ప్రచురించిన సమగ్ర ప్రపంచ అధ్యయనంలో సంపదకు, దాతృత్వానికి మధ్య ఉన్న బంధం వెలుగులోకి వచ్చింది. బర్మింగ్‌హాం యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు 76 దేశాల్లో 80 వేల మందిని ఈ అధ్యయనం కోసం ప్రశ్నించారు. ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొని, వాటిని అధిగమించి సంపన్నులుగా ఎదిగిన వ్యక్తులు విరాళాలు ఇవ్వడం, స్వచ్ఛంద సేవ చేయడం, ఇతరులకు సాయపడడం వంటి దాతృత్వ, సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. డబ్బు సంపాదన పెరిగే కొద్దీ సామాజిక బాధ్యత తగ్గిపోతుందన్న భావన చాలా మందిలో ఉందని, అయితే ఇది కేవలం అపోహ మాత్రమేనని బర్మింగ్‌హాం వర్సిటీకి చెందిన న్యూరోసైన్స్ ప్రొఫెసర్, అధ్యయన సహ రచయిత పాట్రీషియా లాక్‌వుడ్ తెలిపారు. దాతృత్వ కార్యక్రమాల కోసం అధికంగా విరాళాలు ఇచ్చే వ్యక్తులు సంపన్నులలోనే అధికంగా ఉన్నారని, ఈ సుగుణం అనేక దేశాలలో కనిపించిందని ఆయన చెప్పారు.

'ఆర్డినెన్స్' ఉద్యోగుల సెలవులు రద్దు

జబల్‌పూర్ : జబల్‌పూర్‌లోని ఖమారియా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగుల అన్ని లాంగ్ లీవ్‌లు తక్షణమే రద్దయ్యాయి. గురువారం జరిగిన సమావేశం తర్వాత చీఫ్ జనరల్ మేనేజర్ ఇచ్చిన ఉత్తర్వును ప్రస్తావిస్తూ డిప్యూటీ డైరెక్టర్, వర్క్స్ మేనేజర్ అవినాష్ శంకర్ ఈ చర్యను ధ్రువీకరించారు. రెండు రోజుల కంటే ఎక్కువ సెలవు అభ్యర్థన ఇప్పుడు రద్దయింది. 'ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి' ఈ చర్య తీసుకున్నట్లు శంకర్ పేర్కొన్నారు. ఏఎన్ఐ వార్తా సంస్థ నివేదించినట్లుగా... అదే ఫ్యాక్టరీకి చెందిన ఉన్నతాధికారి ఒకరు... 'జాతీయ భద్రత దృష్ట్యా' ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ జబల్‌పూర్ విభాగమే కాదు. కనీసం ఏడు ఎంఐఎల్ నడిచే కర్మాగారాలు ఇలాంటి చర్యలను అమలు చేశాయి. బెంగాల్‌లోని గన్ అండ్ షెల్ ఫ్యాక్టరీ-కాసిపోర్‌లోని కార్మికులు తమ సెలవులను రద్దు చేసినట్లు ధ్రువీకరించారు. 'ప్రస్తుత పరిస్థితిలో సెలవులను రద్దు చేస్తూ శుక్రవారం ఒక ఉత్తర్వు జారీ అయింది' అని శుక్రవారం ఒక ఉద్యోగి చెప్పారు. కోల్‌కతాలోని ఒక అధికారి ఇలా వ్యాఖ్యానించారు... 'ప్రస్తుత పరిస్థితిని బట్టి సెలవులను రద్దు చేస్తే అది సరైనదిగా ఉంటుంది' అని అన్నారు. ఒడిశాలోని బలంగిర్‌లోని బాద్మల్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని ఉద్యోగులకు 60 రోజుల పాటు సెలవులు అనుమతించబడవని సమాచారం అందింది. ప్రధాన ఎంఐఎల్ సదుపాయాలు అయిన చంద్రపూర్, ఇటార్సిలో కూడా అవే నిబంధనలు వర్తిస్తాయి. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించిన తరువాత ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు అప్రమత్తమయ్యాయి. మునిషన్స్ ఇండియా లిమిటెడ్‌లోని ఒక ఉన్నతాధికారి మాట్లాడుతూ కంపెనీ 'అలర్ట్ మోడ్' లోకి ప్రవేశించిందని చెప్పారు. 'మా ఉత్పత్తిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంటే, మేము దానిని చేయగలగాలి.
కానీ 12 ఫ్యాక్టరీలలోని ఉద్యోగుల సెలవులను రద్దు చేయడానికి అధికారిక నిర్ణయం లేదు' అని ఎంఐఎల్ ఫ్యాక్టరీ ఉన్నతాధికారి ఒకరు అన్నారు. అయినప్పటికీ, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ చంద్రపూర్, జబల్‌పూర్‌లోని ఓఎఫ్‌కే వంటి కీలక యూనిట్లలో ఈ కఠిన వైఖరి తీసుకున్నారు. ఈ యూనిట్లలోని 7 వేల ఉద్యోగులందరూ పొడిగించిన సెలవు కోసం దరఖాస్తు చేసుకోవద్దని ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఆమోదించబడిన ఏవైనా అభ్యర్థనలు ఉపసంహరించడం జరిగింది. భారతదేశంలోని అతిపెద్ద సైనిక మందుగుండు సామగ్రి కర్మాగారాలలో ఒకటైన ఓఎఫ్‌కే కార్గిల్ యుద్ధంలో బోఫోర్స్ షెల్స్‌కు ఫ్యూజ్‌లను సరఫరా చేసింది. బాలకోట్ వైమానిక దాడిలో ఉపయోగించిన 1,000 పౌండ్ల బాంబులను ఉత్పత్తి చేసింది. ఏప్రిల్‌లో ఉత్పత్తి కొరత కూడా ఈ నిర్ణయానికి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ చంద్రపూర్ అధికారులు అంగీకరించారు. దేశీయ, ప్రపంచ ఆయుధ ఆర్డర్‌లను నెరవేర్చాల్సిన ఒత్తిడిలో వారు ఉన్నారు. అయితే సెలవుల రద్దు విషయమై అధికారిక కేంద్ర ఆర్డర్ ఉందా లేదా అనే దానిపై గందరగోళం ఉంది. రక్షణ ఉత్పత్తి శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారి మాట్లాడుతూ 'ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు ఈ విషయంలో మేము ఎటువంటి అధికారిక ఉత్తర్వు జారీ చేయలేదు. కానీ కొన్ని పీఎస్‌యూలు ప్రస్తుత పరిస్థితి కారణంగా సెలవుపై వెళ్లకుండా ఉండాలని అంతర్గతంగా తమ ఉద్యోగులకు సూచించాయి' అని తెలిపారు.

ఒత్తిడిలో రక్షణ తయారీ వ్యవస్థ

పూణేలోని ప్రధాన కార్యాలయం కలిగిన మునిషన్స్ ఇండియా లిమిటెడ్, పినాకా రాకెట్ లాంచర్ల నుంచి హ్యాండ్ గ్రెనేడ్లు, పదాతిదళ మందుగుండు సామగ్రి వరకు ప్రతిదీ ఉత్పత్తి చేసే 12 ప్రధాన కర్మాగారాలను నిర్వహిస్తోంది. ఈ ఫ్యాక్టరీలు భారత సైన్యం, వైమానిక దళం, వివిధ ఎగుమతి క్లయింట్లకు సేవలు అందిస్తున్నాయి. వాటి ఉత్పత్తిలో 5.56 ఎంఎం, 7.62 ఎంఎం, 9 ఎంఎం బుల్లెట్లు, ట్యాంక్ షెల్లు, మోర్టార్ బాంబులు, అధిక పేలుడు సామాగ్రి ఉన్నాయి. అయితే జాతీయ రక్షణ, ఎగుమతి రెండింటికీ డిమాండ్ పెరుగుతున్నందున శ్రామిక శక్తి సరఫరా చేయాల్సిన ఒత్తిడిలో ఉంది.

నీట్ పరీక్ష ప్రారంభం

న్యూఢిల్లీ: వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్ష ఆదివారం దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. నిబంధనల మేరకు వివిధ కేంద్రాల వద్ద నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షకు అనుమతించలేదు. సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష జరుగుతుంది. దేశవ్యాప్తంగా 552 నగరాలు, పట్టణాల్లో ఐదు వేలకు పైగా పరీక్షా కేంద్రాలు... అలాగే దేశం వెలుపల 14 నగరాల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నీట్ పరీక్ష నిర్వహిస్తోంది. గతేడాది నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ కావడంతో పాటు ఇతర అవకతవకలు చోటు చేసుకోవడంతో... ఈసారి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ విధించారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగుతో కలిపి 13 భాషల్లో ఈ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహిస్తోంది. విద్యార్థులను పక్కాగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. జాతీయ స్థాయిలో 23 లక్షల మందికి పైగా నీట్ రాసే అవకాశముందని అంచనా. అర్హత సాధించిన విద్యార్థులకు దేశవ్యాప్తంగా 776 మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు అవకాశం లభిస్తుంది. జాతీయ స్థాయిలో 1.17 లక్షల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలో ఎస్.ఆర్.డి.పి ఇతర శాఖల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు పరిశీలించారు. ముందుగా చీఫ్ సెక్రెటరీ బంజారాహిల్స్‌లో జివికె మాల్ వద్ద సుమారు రూ.5 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. తదనంతర దారుషిఫా వద్ద మెట్రో లైన్ అలైన్మెంట్ (ఓల్డ్ సిటీ కారిడార్) పరిశీలించారు. ఓల్డ్ సిటీ కారిడార్ ఎంజిబిఎస్ బస్ స్టేషన్ నుండి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టే మెట్రో లైన్ పనుల గుర్తించి మెట్రోలైన్ ఎండి ఎన్విఎస్ రెడ్డి చీఫ్ సెక్రెటరీకి వివరించారు. భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా చేయాల్సి ఉందని వివరించారు. ఇప్పటి కి భూసేకరణపై ప్రజలు సహకరిస్తున్నట్లు. ఏండీ తెలియజేశారు. హుస్సేన్ ఆలమ్‌లో ఉన్న ఖుర్షీద్ ఝా దేవిడి హెరిటేజ్ భవనం హెచ్ఎండిఏ నిధులతో కన్సర్వేషన్ రెస్టోరేషన్, మరమ్మత్తులు పనులను సిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎస్ నిర్వాహకులతో మాట్లాడుతూ పార్కింగ్ అనువైన స్థలం ఉన్న నేపథ్యంలో హెరిటేజ్ భవనం మెయింటేనెన్స్ కోసం ఎగ్జిబిషన్ ఇతరత్ర వినూత్న ఈవెంట్స్ నిర్వహించి వచ్చిన నిధులతో హెరిటేజ్ భవనం నిర్వహణకు ఖర్చు చేసుకొనే వెసులుబాటు ఉంటుందని సూచన చేసారు. అక్కడ నుండీ ఫలక్నమా ఆర్.ఓ.బి పనులను పరిశీలించారు. జిహెచ్ఎంసి సంబంధించిన పనులు తుది దశలో ఉన్నాయని, రైల్వే పోర్షన్ పూర్తి చేసిన తరువాత సర్వీస్ రోడ్డుకు 5 ఆస్తులను సేకరణ పూర్తి చేసి నెలరోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నట్టు ఏంఏయుడి సెక్రెటరీ ఇలంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ సిఎస్‌కు వివరించారు. ఆగస్టు వరకు పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు. తప్పని సరిగా పూర్తి చేసి అందుబాటు లోకి తీసుకొని రావడం జరుగుతుందని, రైల్వే పోర్షన్ పనులు మొదలుపెట్టిన నేపథ్యంలో ఆగస్టు చివరి వరకు పూర్తి చేయించడం జరుగుతుందని సిఎస్ కు వారు వివరించారు. అక్కడి నుండి ఫలక్ నూమా ఫ్లై ఓవర్ నుండి నల్గొండ ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తూ మూసి నదిపై ముసారంభాగ్ వద్ద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈ బ్రిడ్జి నిర్మాణం వలన ప్రజలకు జరిగే ప్రయోజనాల గురించి వివరించారు. భూసేకరణ పప్రక్రియ గురించి సిఎస్ అడుగగా ఇంకా కొన్ని ఆస్తుల్ని చేయాల్సి ఉందని అధికారులు సిఎస్‌కు వివరించారు. అక్కడ నుండి వాటర్ వర్క్స్ ద్వారా చేపట్టిన ఎస్.టి.పి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎండిని ఆదేశించారు. ఈ సందర్భంగా సిఎస్‌కే రామకృష్ణ రావు మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారని అన్నారు. సీఎం ఆదేశాలతో హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించామన్నారు. ఓల్డ్ సిటీ మెట్రోకు నిధుల కొరత లేదని ఓల్డ్ సిటీ మెట్రోకు ఆస్తుల సేకరణ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు సిఎస్ తెలిపారు. జిహెచ్ఎంసి ఎస్ఆర్‌డిపి ద్వారా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ ఇతర మౌలిక సదుపాయాల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ముసారం బాగ్ బ్రిడ్జి పనులను పరిశీలించనున్నారు. అట్టి పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు లేకుండా చేస్తానన్నారు. అంతే కాకుండా జలమండలి నిర్మస్తున్న ఎస్టీపిలు అన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సిఎస్ పేర్కొన్నారు. టూరిజం శాఖతో అన్ని శాఖలు సమన్వయం చేసుకొని మిస్ వరల్డ్ పోటీలు విజయవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఎం వెంట ఎంఏయుడి సెక్రెటరీ కె.ఇలంబర్తి, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్, మెట్రో రైల్వే ఎండి ఎన్.వి.ఎస్ రెడ్డి, వాటర్ వర్క్స్ ఎం.డి అశోక్ రెడ్డి, జిహెచ్ఎంసీ ప్రాజెక్టు మెయింటేనెన్స్ సిఈ లు భాస్కర్ రెడ్డి, రత్నాకర్, కులీ కుత్బుషా అభివృద్ధి అథారిటీ అధికారులు, చార్మినార్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్లు వెంకన్న, రవి కిరణ్, ప్రాజెక్ట్ ఈఈ రోహిణి, బి ఎల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నుండి యువతను కాపాడేందుకు ప్రభుత్వం కృషి

విజయవంతంగా ముగిసిన టీ 20 ఛాంపియన్ షిప్ క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ ఖేలో - నషా చోడో అనే నినాదంతో... నో డ్రగ్స్ - నో బెట్టింగ్స్ అంటూ నిర్వహించిన టీ20 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం ముగింది. ఎల్బీ స్టేడియంలో ఏప్రిల్ 27వ తేదీ నుండి ఆదివారం వరకు 20 ఛాంపియన్ షిప్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి క్రింద రూ.5,55,555లను రెండో బహుమతిగా రూ.3,33,333లను అందచేశారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్లేయకు ఎలక్ట్రిక్ స్కూటీ, బెస్ట్ బౌలర్‌కు స్మార్ట్ టీవీ, ఇతర ప్లేయర్లకు బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ అనే మహమ్మారి, బెట్టింగ్ యాప్స్ బారిన నేటి యువత పడకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గట్టి ప్రయత్నం చేస్తుంది అన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర యువజన కాంగ్రెస్ తరపున నేటి యువత చెడు వ్యసనాలకు, బెట్టింగ్‌లకు బానిసలు కాకుండా, యువతను మేలుకొలిపే దిశగా ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందన్నారు. యువత బంగారు భవిష్యత్తుకై యువజన కాంగ్రెస్ తరపున ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడతామని తెలిపారు.

విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : నల్ల పోచమ్మ మహంకాళి ఎల్లమ్మ తల్లుల దీవెనలు ప్రతి ఒక్కరికి ఉండాలని మల్కాజిగిరి శాసన సభ్యులు రాజశేఖర్ రెడ్డి అన్నారు. జయగిరి లక్ష్మీ నరసింహస్వామి నగర్‌లో గత మూడు రోజులుగా కొనసాగుతున్న నల్ల పోచమ్మ, మహంకాళి, ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవులు హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాండురంగన్, సత్యనారాయణ, సాధు పరమేష్, శ్యామ్ గౌడ్, రాజా మల్లేష్ తోపాటు స్థానిక నాయకులు జేఏసీ వెంకన్న, సిద్ధిరాములు, హేమంత్ పటేల్, కిట్టు, నర్సింగ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి మండలంలో జేఎన్‌టియు కాలేజీ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష నిర్వహణను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు పనితీరును ప్రిన్సిపల్ గదిని పరిశీలించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

భూములపై అధికారుల దౌర్జన్యం

మా రైతుల భూములు మాకు కావాలంటున్న రైతులు

విశాలాంధ్ర - హనుమకొండ : రైతుల వ్యవసాయ భూమిలో వరంగల్ ఆర్డీఓ సంగెం మండల ఎమ్మార్వో, పోలీసులు ఇద్దరు కలసి దౌర్జన్యంగా తమ భూములపై జేసిబి, డోజర్లతో చదును చేస్తూ మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబంధించి కొందరు రైతులు హై కోర్టులో కేసు వేయగా దీనిపై హైకోర్టు స్టే ఇచ్చింది. కోర్టు స్టేను దిక్కరించి మా వ్యవసాయ భూములను చదును చేయడాన్ని కొందరు రైతులతో పాటు నూర సంపత్ కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. పోలీసులు, ఆర్డీఓ భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్యానికి పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు. సాక్షాత్తు ఆర్డీఓ ముందు రైతులపై దౌర్జన్యానికి పాల్పడిన అధికారులు, పోలీసుపై, అధికారులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

16న అమెరికాకు ఎమ్మెల్సీ కవిత

విదేశీ పర్యటనకు అనుమతిచ్చిన సీబీఐ కోర్టు

విశాలాంధ్ర -హైదరాబాద్ : తన కుమారుని గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కవిత దంపతులు ఈనెల 16న అమెరికాకు వెళ్లనున్నారు. ఈ మేరకు తనకు విదేశీ పర్యటనకు అనుమతించాలని అమె సీబీఐ కోర్టును ఆశ్రయించగా దాని పై కోర్టు సానుకూలంగా స్పందించింది. దీంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల16 నుంచి 23 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. తమ కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎమ్మెల్సీ కవిత - అనిల్ దంపతులు ఈ నెల 16వ తేదీన అమెరికాకు బయలుదేరనున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. ఈ విదేశీ పర్యటనకు ఢిల్లీలోని రౌజ్ ఎవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రశాంతంగా నీట్ పరీక్ష నిర్వహణ: కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం మాసబ్ ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న పరీక్షా కేంద్రంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాజరు, సీసీ కెమెరాల నిర్వహణ, బయోమెట్రిక్ విధానం, జామర్, త్రాగునీటి ఏర్పాట్లు అలాగే వికలాంగులకు క్రింది ఫ్లోర్‌లో పరీక్ష రాసే విధానంపై సెంటర్ సూపర్డెంట్‌తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నీట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో పకడ్బందీ చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కేంద్రంలో 480 అభ్యర్థులకు గాను 464 మంది పరీక్ష హాజరు అయినారని 16 మంది గైర్హాజర్ అయ్యారని సూపర్డెంట్ కలెక్టర్‌కి వివరించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ సూపర్డెంట్ డాక్టర్ చంద్రశేఖర్, కే.హరికృష్ణ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి కన్నుమూత

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ.ప్రియదర్శిని మృతి చెందారు. అదివారం ఉదయం 10.15 నిమిషాలకు అమె తన నివాసంలో మరణించినట్లు హైకోర్టు రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నాడు ఉదయం అమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వెల్లడిరచారు. అమె మరణ వార్త తెలిసిన హైకోర్టు జడ్జీలు, అడ్వకేట్లు, హైకోర్టు సిబ్బంది అమె ఇంటికి చేరుకుని పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అమెతో పాటు అమె తనయుడు నిఖిల్ కుంచె కూడా హైకోర్టులో జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, జడ్జిలు వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం : హరీష్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ విద్యార్థుల జీవితాలతో అడుకుంటుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మండిపడ్డారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం మీనమేషలు లెక్కించడం అయన తప్పుపట్టారు. అదివారం సామాజిక మాధ్యం ఎక్స్ వేదికగా అయన ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మాజీ మంత్రి హరీష్‌రావు ఫైర్ అయ్యారు. డిగ్రీ విద్యార్థులకు ఇంకా ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వకుండా కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. బడా కాంట్రాక్టర్లకు వేలకోట్లు దోచిపెట్టారు తప్ప విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇచ్చేందుకు మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నిలదీశారు. డిగ్రీ విద్యార్థులకు రూ.800 కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వకుండా 6 లక్షల మంది విద్యార్థుల జీవితాలను అగమ్య గోచరంగా మార్చేసిందన్నారు. డిగ్రీ పరీక్షలు సమయానిక నిర్వహించకపోవడంతో ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ లాసెట్, పీజీసెట్, ఇతర సెట్ ఎగ్జామ్స్ రాయలేకపోతున్నారని అవేధన వ్యక్తం చేశారు. ఏప్రిల్‌లోనే ఎగ్జామ్స్ నిర్వహించాల్సి ఉన్నా ఇప్పటి వరకు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల స్టూడెంట్లు, యాజమాన్యాలు తీవ్రమైన నిరసన తెలుపుతున్నా ఎందుకు ప్రభుత్వం స్పందించట్లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా రీయంబర్స్‌మెంట్ ఆపలేదని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే విద్యార్థులను ఇబ్బందుల్లో పడేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఖరి కారణంగా డిగ్రీ అడ్మిషన్లు నిలిపేసి కాలేజీలకు తాళం వేసే పరిస్థితి తీసుకొచ్చిందని, 17 నెలల్లో 17 పైసలు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నా విద్యార్తుల జీవితాలకు అతీగతీ లేకుండా పోతోందన్నారు. మొన్న అసెంబ్లీలో ఫీజు రీయంబర్స్ మెంట్లు త్వరలోనే ఇస్తామని రేవంత్ ప్రకటించినా ఇప్పటికీ అమలు కాలేదన్నారు. పాలన చేతకాక విద్యార్థులతో ఆడుకుంటే ఊరుకునేది లేదు' అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్

విశాలాంధ్ర - కాప్రా : ఓట్లు, సీట్లు ప్రామాణికం కాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది కేవలం కమ్యూనిస్టులేనని, సంపన్నులపై ఆర్థిక భారాన్ని మోపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్.బోస్ ఉద్ఘాటించారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లు ప్రాధాన్యత ప్రామాణికం అయినప్పటికీ, ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో పాలకవర్గాలు ప్రజా సమస్యల పరిష్కారానికి మాత్రం చొరవ చూపడం లేదని విమర్శించారు. ఇటీవలి కాలంలో అమలు అవుతున్న నయా ఉదారవాద, ఆర్థిక సంస్కరణలో భాగంగా ప్రస్తుత మోదీ ప్రభుత్వం ప్రత్యక్ష పన్నులను గణనీయంగా తగ్గించి, రెవిన్యూ రాబడికి ప్రధానంగా పరోక్ష పన్నుల పైనే ఆధారపడ్డు న్నదని, ప్రశోయక్ష పన్నుల జాబితాలోకి సంపన్నులు, పారిశ్రామికవేత్తల ఉద్యోగస్తుల నుండి వసూలు చేసే కార్పొరేటు ఇన్కమ్ టాక్సు వగైరాలుండగా, పరోక్ష పన్నుల జాబితాలోకి పెట్రోలు, విధించే పన్నుల వివిధ సరుకుల, సేవల విక్రయంలో విధించే జి.ఎస్.టి వగైరా పన్నులుంటాయని వారు అన్నారు. 2023లో కార్పొరేట్ పన్ను 30 నుండి 22 శాతానికి తగ్గించారు. సంపద పన్ను తగ్గింపు వల్ల 2000 కోట్ల రూపాయలు, కార్పొరేట్ పన్ను తగ్గింపుతో మూడు లక్షల కోట్ల రూపాయల రెవిన్యూ లోటు 2024లో కలిగింది. మొదటసారిగా కార్పొరేట్ పన్ను చెల్లింపులు ఆదాయం పన్ను కంటే తగ్గిపోయాయని, దీని ఫలితంగా పారిశ్రామికవేత్తలు, అత్యంత ధనికుల లాభాలు గత మూడు సంవత్సరాల్లో 57 శాతం పెరిగినవని వారు ఉద్ఘాటించారు. దేశంలో ధనికులు రోజుకు రూ.2,200 కోట్లు వెనకేసుకుంటున్నారని, కాబట్టి ఆర్థిక భారాన్ని సంపన్నులపై వేయాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నదని వారు అన్నారు. అదే విధంగా సీపీఐ 3వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 19-22 వరకు మేడ్చల్ జిల్లాలో నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సమితి నిర్ణయించిందని, మొదటి రోజు భారీ ప్రదర్శన, ర్యాలీతో ప్రారంభమై, మిగతా మూడు రోజులు ప్రతినిధులు సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుండి వేల సంఖ్యలో సీపీఐ శ్రేణులు హాజరవుతారన్నారు. మేడ్చల్ జిల్లా సీపీఐ 4వ మహాసభ ఈ నెల 25వ తేదీన మేడిపల్లి మండలంలో జరుగుతుందని ప్రకటించారు. ఈ సమావేశంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్, సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శులు జీ. దామోదర్ రెడ్డి, ఈ. ఉమామహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, దశరథ్, హరనాథ్‌రావు, రచ్చ కిషన్, కె. ధర్మేంద్ర, వెంకట్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు రామ్ నారాయణ, సత్య ప్రసాద్, నారా నర్సింహా, కల్లూరు జయచంద్ర, శ్రీనివాస్, సహదేవ్, సల్మాన్ బేగ్, యాదగిరి, ప్రమీల, మాధవి, లక్ష్మీ నారాయణలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొద్దిమంది కాంట్రాక్టర్ల కోసం అధికారుల ఆరాటం...!

జిహెచ్ఎంసికి ఒరిగేది శూన్యం...

వ్యక్తిగత ప్రయోజనం కోసం తంటాలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : కొద్ది మంది కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకు ఎంటమాలజీ విభాగం టెండర్లలో ఇష్టానుసారంగా నిబంధనలు విధించడంతో పలువురు కాంట్రాక్టర్లు టెండర్లకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అధికారులు ప్రయోజనం పొందేందుకు కొద్ది మంది కాంట్రాక్టర్లకు కొమ్ము కాసేందుకు టెండర్ల నిబంధనలు మార్చి కొద్ది మందికే టెండర్లను కట్టపెట్టే ప్రయత్నం చేస్తుండడం చూస్తుంటే సంస్థ ప్రయోజనం కంటే అధికారులు వారి ప్రయోజనాలను నెరవేర్చుకునే పనిలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. జిహెచ్ఎంసి పరిధిలోని పలు జోన్‌లలో ఎంటమాలజీ విభాగానికి సంబంధించిన టెంటర్లు పూర్తి అయ్యాయి. ఈ టెండర్ నిబంధనల్లో అధిక టర్నోవర్ ఉండాలని, ఈఎస్ఐ, ఈపిఎఫ్ కల్పించి ఉండాలనే నిబంధనలు విధించడం విడ్డూరంగా ఉందనే విమర్శలున్నాయి. ఈఎస్ఐ, ఈపిఎఫ్ లాంటివి కాంట్రాకర్‌కు ఇచ్చే బిల్లు నుండి కట్ చేసుకుని మిగతా బిల్లు చెల్లిస్తున్న విషయాన్ని అధికారులు విస్మరించడం గమనార్హం. కాంట్రాక్టర్ బిల్లు నుండి కట్ చేసిన ఈఎస్ఐ, ఈపిఎఫ్ మొత్తాన్ని అధికారులు ఓ ఏజెన్సీ చెల్లించాల్సి ఉంటుందనే విషయాన్ని అధికారులు పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. అన్ని జోన్‌ల కంటే ఖైరాతాబాద్ జోన్‌లో ఎస్.ఈ. మరింత ముందుకేసి నిబంధనలు కఠినతరం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఎంటమాలజీ టెండర్లలో అధికారుల దురాలోచనపై పలువురు కాంట్రాక్టర్లు ప్రజావాణిలో, కమిషనర్‌కు కూడ ఓ లేఖను అందజేసినా దానిపై ఎలాంటి చర్చగానీ చర్యలు గానీ చేపట్టకపోవడం శోచనీయం. ఎన్ని లేఖలిస్తేనేం సంస్థ కోసం ఆలోచించే సమయం వారికి ఉండాలి కదా ! టెండర్ నిర్వహణలో సంస్థలకు ప్రయోజనం చేసకూర్చే విధంగా ఉండాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా అడుగులు వేయకుండా సొంత ప్రయోజనాలు పూర్తి చేసుకునేందుకు ముందు వెళ్తున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ టెండర్లను సరిదిద్దాల్సిన ఇంచార్జి చీఫ్ ఎంటమాలజిస్టు కూడ పట్టించుకునే పరిస్థితి లేదని పలువురు కాంట్రాకర్తర్లు పేర్కొంటున్నారు. తమ అభిప్రాయాన్ని తెలియజేసేందు ఇంచార్జి చీఫ్ ఎంటమాలజిస్టు 3-5 గంటల మధ్య వెళ్ళినా కూడ సమయం ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏంటని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. విషయం తెలియకపోతే తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇంచార్జి సీ.ఈ. కూడ అదే తరహాలో ఉండడం జిహెచ్ఎంసిని లూటి చేసే పరిస్థితే తప్ప జిహెచ్ఎంసికి మేలు చేసే అవకాశమే లేకుండా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2016 జిహెచ్ఎంసి కమిషనర్ రూపొందించిన నిబంధనల ప్రకారం టెండర్లు నిర్వహించాల్సి ఉండగా అధికారులు తమ ఇష్టానుసారంగా నిబంధనలు విధించడంలో ఆంతర్యం ఏంటని పలువురు వాపోతున్నారు. ఇప్పటి వరకు పలు జోన్‌లల్లో నిర్వహించిన టెండర్లల్లో నాలుగు సంస్థల చెందిన వ్యక్తులకే టెండర్లు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయనే అభిప్రాయం ఉంది. ఈ నాలుగు సంస్థల్లో ఓ ప్రముఖ కాంట్రాక్టర్‌కు కంప్యూటర్ ఆపరేటర్లకు సంబంధించిన కాంట్రాక్టు కూడ ఉంది. ఈ కాంట్రాక్టర్ చెప్పినట్లు ఆ కంప్యూటర్ ఆపరేటర్లు టెండర్ నిబంధనలు తయ్యారు చేసిన అధికారుల ముందు పెట్టడం, అధికారులు చూసి చూడకుండా టెండర్లు జారి చేయడం జరుగుతుందనే ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన టెండర్లను తక్షణమే రద్దు చేసి అన్ని వర్గాల కాంట్రాక్టర్లుకు టెండర్లు దక్కేలా చూడాలే గానీ అధికారులు సొంత ప్రయోజం పొందే విధంగా టెండర్ల ప్రక్రియ జరిగిందని కాంట్రాక్టర్ల నుండి ఆవేదన వ్యక్తం అవుతోంది.

కడ్తాల్ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ

విశాలాంధ్ర - అమనగల్లు : కడ్తాల్ మండల జర్నలిస్టుల సమావేశం ఆదివారం మైసిగండి మైసమ్మ ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ పత్రిక విలేకరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. అనంతరం మైసిగండి మైసమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విదంగా నూతన కార్యవర్గాన్ని ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా నూతన గౌరవ అధ్యక్షులు తిరుపతి గౌడ్, అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడారు. తమపై నమ్మకం ఉంచి తమ ఎన్నికకు సహకరించిన పాత్రికేయ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కడ్తాల్ మండల విలేకరుల సమస్యలు, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అధ్యక్షులుగా తిరుపతి గౌడ్, అధ్యక్షులుగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గిరిధర్, కార్యదర్శిగా సురేందర్ గౌడ్, కోశాధికారిగా మహేష్‌తో పాటు మరి కొందరు సభ్యులుగా ఎన్నుకున్నారు.

శ్రీ సగర భగీరథ మహర్షి జయంతోత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ రవీంద్ర భారతిలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ సగర భగీరథ మహర్షి జయంతోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. విద్య వల్లనే ఉన్నత శిఖరాలకు ఎదగగలుగుతామని, నేను విద్యార్థి సంఘ రాజకీయాల్లో కాలేజి సంఘ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికై 36 సంవత్సరాలుగా అనేక ఉద్యమాల్లో పాల్గొని ఈ రోజు ఇక్కడ ఉన్నట్లు ఆయన తెలిపారు. మీరు రాజకీయంగా ఎదగాలంటే సగరులు ఐక్యంగా ఉండాలని, కష్టపడి పని చేసే శక్తి ఉందని, మీరు రాజకీయంగా ఎదగాలని, భగీరథ సాధ్యం చేసుకున్నటువంటి స్ఫూర్తితో శాసనసభలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండేలా మీరు ముందుకు పోవాలన్నారు. రాజకీయాలు ఎవరి హక్కు కాదని, ఎవరి సొంతం కాదన్నారు. ఎక్కడ అవకాశాలు వస్తె ఎక్కడ ఉన్నత విద్యకు అందుకోవాలన్నారు. రాజకీయంగా ఐక్యత ఉండాలని, మీకు ఐక్యత ఉంటే ప్రభుత్వమే మిమ్మల్ని పిలిచి ఏం కావాలో ఇస్తుందన్నారు. దేశానికి రోల్ మోడల్గా తెలంగాణ కుల గణన సర్వే చేసిందని, కిషన్ రెడ్డికి తెలవడం లేదన్నారు. జనాభా లెక్కలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని, కులాల లెక్కలు తేల్చే అధికారం రాష్ట్రానికి ఉందన్నారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా సామాజిక న్యాయం జరగాలని జిత్నే అబాధి ఉత్నే ఇసిదరి అని చెప్పి తెలంగాణలో కుల గణన చేసిందన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేస్తామని చెప్పిందని, ఇది తెలంగాణ ప్రభుత్వ విజయమని, రాహుల్ గాంధీ విజయమన్నారు. సామాజిక పరంగా రాబోయే కాలంలో తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేయడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు పోతున్నామని, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, కంచే ఐలయ్యను కలిసి మీ సామాజిక పరిస్థితులు వివరించండని, సగర సంఘంకి అండగా ఉంటానని, భగీరథ వంశానికి చెందిన మీరు మీ ప్రయత్నాన్ని శపథం లాగ ప్రారంభించండని ఆయన తెలిపారు.

సగర సంఘం వాళ్ళకి భవిష్యత్తులో మంచి మంచి అవకాశాలు వస్తాయని, మీరు ఐక్యంగా ముందుకు పోవాలని, ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేత జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్, జాతీయ బి.సి సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి సత్యం, సగర భగీరథ ఆత్మగౌరవ భవనం వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ మారుతి సగర, సగర సంఘ నాయకులు, సంఘాలు, బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని విగ్రహా ప్రతిష్టలో మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శంకర్ నగర్ కాలనీలో గల దత్తక్షేత్రంలో భక్తుల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చడానికి శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్లు ముఖ్య అతిథిలుగా పాల్గొని శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బండి శ్రీరాములు, రాజా రాజా, కాలనీ వాసులు సంబిరెడ్డి, శశిమోహన్ గుప్తా మరియు శ్రీకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం :ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అమనగల్లు: అకాల వర్షానికి తడిసినటువంటి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రతి రైతును ఆదుకుంటుం దని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి భరోసా నిచ్చారు. అమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలుకేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తడిసిన వరి ధాన్యం కుప్పలను చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి ధాన్యం తడవడం బాధాకరమన్నారు.రైతులు అధైర్య పడవద్దని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే హామీ నిచ్చారు. అంతేకాకుండా ప్రతిపక్ష పార్టీల నాయకులు రైతుల మేలు కోరుతూ మంచి సలహాలు ఇవ్వాల్సింది పోయి ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం బాధాకరమన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు ఇబ్బందులు జరగకుండా చర్యలు తీసుకోవలాని అధికారులను సూచించారు. పంటలు కోతకు వచ్చిన దశలో అకాల వర్షాలు పడి రైతులను తీవ్రంగా నష్టపరిచిందని, అధికారులచే పంట నష్టాన్ని అంచనా వేయించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.వర్షాలు పడే అవకాశం ఉన్నందున కళ్ళల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ చైర్మన్ యాట గీత, మండల పార్టీ అధ్యక్షులు జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కండే పాండు రంగయ్య, అజీమ్, వస్పుల శ్రీశైలం, తాళ్ల రవీందర్, పట్టణ అధ్యక్షులు మానయ్య, నాయకులు అప్పం శ్రీనివాస్, శివలింగం, ఖాదర్, కరీం, మెకానిక్ బాబా, ప్రసాద్, రహీమ్, ఫరిద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

13వరకు కొనసాగనున్న కార్యక్రమం : మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగానికి సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే నూతన కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టనుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని మే 5 నుండి జూన్ 13 వరకు రాష్ట్రంలోని సుమారు 1200 గ్రామాలలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సుమారు 200 పైగా శాస్త్రవేత్తల బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. దక్షిణ తెలంగాణ మండలాల్లో సుమారు 100 బృందాలు, ఉత్తర మరియు మధ్య తెలంగాణ మండలాల్లో సుమారు 50 బృందాలు పాల్గొంటాయన్నారు. ఒక్కో బృందం వారి రోజూవారి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు, వారంలోని పని దినాలలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపిక చేసుకున్న గ్రామాలలోని రైతు వేదికల్లోగాని మరే ఇతర సౌకర్యవంతమైన ప్రదేశంలో గాని రైతులకు యూరియా వాడకం తగ్గించడం, రసాయనాలను జాగ్రత్తగా వాడటం, చెల్లింపు రశీదులను భద్రపరచడం, సాగునీటి ఆదా, పంటల మార్పిడి, చెట్లను పెంచటంపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అంశాలతో పాటు రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళకు సూచనలు, సలహాలు అందజేస్తారు. ఒక్కో బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలతోపాటు వ్యవసాయ విద్యార్థులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇతర స్థానిక ప్రభుత్వ అధికారులు, అభ్యుదయ రైతులు, సంఘాలు పాల్గొంటారు. అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని విశ్వ విద్యాలయంలోని అన్ని వ్యవసాయ కళాశాలలు, పాలిటెక్నిక్స్, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహిస్తాయి. విశ్వవిద్యాలయంలోని ఉన్నత స్థాయి అధికారులతో పాటు వివిధ మండలాల్లోని సహ పరిశోధనా సంచాలకులు, కళాశాలల డీన్లు దీనిని పర్యవేక్షిస్తారని మంత్రిగారు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా శాస్త్రవేత్తలకు, విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అన్నదాతలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని మంత్రిగారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని, కాని గత ప్రభుత్వాలు వాటిని పట్టించుకోనందున రైతులు ఇలాంటి అవకాశాలను దూరం చేసుకున్నారన్నారు. కానీ మా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల శ్రేయస్సు కోసం, రైతులకు వ్యవసాయ సంబంధిత వివిధ అంశాలపై అవగాహన కల్పించే దిశగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని, కావునా రైతులు పెద్ద ఎత్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని, అలాగే వారికి వ్యవసాయ సంబంధిత అంశాలపై గల అనుమానాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేసుకోవాలని మంత్రి సూచించారు.

ప్రజలను మోసం చేసేందుకు కవిత కొత్త రాగం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రజలను మరోమారు మోసం చేసేందుకు బీఆర్ఎస్ నాయకురాలు కవిత కొత్త రాగం తీసుకుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అధికారం పోయిన తరువాత చాలా పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుందని అధికారంలో ఉన్నంత కాలం ఎందుకు ఈ మాటలు మాట్లాడలేదని అయన కవితను నిలదీశారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు సామాజిక తెలంగాణ గుర్తుకు రాలేదా అంటూ నిలదీశారు. ఇప్పటికే తెలంగాణలో రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక ప్రజా పరిపాలన కొనసాగుతుందని చెప్పారు. స్వేచ్ఛగా గొంతు విప్పి మాట్లాడే స్వేచ్ఛ కాంగ్రెస్ ఇచ్చిందని, ఆ స్వేచ్ఛలోనే నీ గొంతు కూడా మాట్లాడుతుందన్నారు. కొత్త కొత్త రాగాలు ఎంచుకుని నటించడం కవితకు వారి కుటుంబానికి సాధ్యం అవుతుందన్నారు. మీ నాయనది నటన పాలన కాని కాంగ్రెస్ ది ప్రజా పాలన అంటూ చెప్పుకొచ్చారు. ఈరోజు మీరు ఇందిరా పార్క్‌లో కూర్చొని మాట్లాడుతున్నారు అంటే అది కాంగ్రెస్ ఇచ్చిన స్వేచ్ఛనే అనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇందిరా పార్క్ వద్దనే కాకుండా జిల్లాలో కలెక్టర్ కార్యాలయం ముందు కూడా ధర్నా చేసే స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ ఇచ్చామని, రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు కులగణన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. కొత్త సిలబస్‌తో మోసానికి ప్రణాళిక లెక్క కవిత ప్లాన్ కనపడిందని అయన పేర్కొన్నారు. పదేళ్ల తన తండ్రి సామాజిక తెలంగాణ పట్టించుకోలేదు అని కవిత ఒప్పుకుందన్నారు. కవిత మనసులో మాటలు ఆమెకు తెలియకుండానే బయటకు వచ్చాయని అభిప్రాయపడ్డారు.

బిజెపిలో భారీగా చేరికలు...

విశాలాంధ్ర - మేడిపల్లి: బిజెపి పార్టీ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఏర్పుల మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీ సాయి రెసిడెన్సి కాలనీ అధ్యక్షులు బజ్జురి శ్రీనివాస్ గుప్తా, చెంగిచెర్ల 3వ వార్డు వారి సమక్షంలో బీజేపీ పార్టీలో చేయడం జరిగింది. బజ్జురి ప్రీతి గుప్తా, బజ్జురి శ్రీనివాస్ గుప్త, శివ గుప్త, రాధా గుప్తా, దిలీప్ గుప్తా, శ్రీశైలం గుప్తా, శ్రీకాంత్ గుప్త, ఉమామహేశ్వరరావు, మల్లారెడ్డి, నరేందర్ రెడ్డి, నాగ మల్లేష్, సూరిబాబు, నాగరత్నం చారి, మనోహర్, లింగారెడ్డి, తులసి, సతీష్ గౌడ్, లక్ష్మణ్, రాము, సుదర్శన్ రెడ్డి, గజేందర్, కృష్ణ, రమేష్ బోస్లే, మహేష్, రవీందర్ రెడ్డి, విశాల్, రవి, పాల్, వెంకటేష్ తదితరులు బిజెపి పార్టీలో చేరారు.

ఉచిత హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కాప్రా : కాకతీయ హాస్పిటల్ ఆధ్వర్యంలో మల్లాపూర్, సూర్యనాగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో, ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంపున మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య పరీక్షలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం కాలనీలో దాదాపు 500 మంది ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత మందులతో పాటు బిపి, డయాబెటిస్, ఆర్థోపెడిక్, కీళ్ల నొప్పులు, దగ్గు, దమ్ము, ఆయాసం, రక్తపోటు, షుగర్ లాంటి పరీక్షలను స్థానికులు ఉచితంగా సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. హరి ప్రకాష్, డా. రఘునాథరెడ్డి, డా. విజయ్ కుమార్, డా. సుమంత్ రెడ్డి, అల్లాడి కృష్ణ, మహిళ సంఘం అధ్యక్షురాలు శశికళ, రవికుమార్, నాగేశ్వరావు, గుండు ముత్యాలు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

మండుతున్న ఎండలు
ఉదయం నుంచే భానుడిప్రతాపం
ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయంటున్న వాతావరణశాఖ
నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు
బెంబేలెత్తుతున్న జనం
శీతల పానీయాలతో యువతకు ఉపాధి



విశాలాంధ్ర - ఆమనగల్లు : భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఓ వైపు భగభగలు.. మరో వైపు వడగాల్పులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే వేడి తీవ్రత కనిపిస్తోంది. బయటికెళ్తే నెత్తిపైన కుంపటి పెట్టినట్లే మండిపోతున్నది. ఇక రాత్రుళ్లు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండు మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇల్లు దాటి బయటకు రావాలంటే జంకుతున్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల సమయంలో ప్రయాణాలు రద్దు చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు పట్టపగలే చుక్కలు చూడటం అంటే ఇదేనేమో. మండుతున్న ఎండలకు జనం చుక్కలు చూస్తున్నారు.

బయటికి రావలంటేనే జనం జంకుతున్నారు. ఉదయం సూర్యోదయం నుంచే సూర్యుడు విశ్వరూపం ప్రదర్శిస్తుండటంతో వేడిమికి తాళలేక ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ముదిరిన ఎండల మూలంగా శీతల పానీయాల కేంద్రాల కొనుగోలు దారులతో కళకళ లాడుతున్నాయి. కూలర్లు, ఏసీ మరమ్మతులు బిజీబిజీగా మారాయి.

జాగ్రత సుమీ..

ఎండలు ముదురుతుండడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతు న్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా బయట తిరిగే ఉద్యోగులు, మార్కెటింగ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్లు అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఎండ నుంచి రక్షణతోపాటు రోగ నిరోధక శక్తి తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎండలో ఎక్కువగా తిరగడం.. పనిచేయడంద్వారా శరీరంలో ఉన్న లవణాల శాతం తగ్గిపోతుందని, నీరసంగా, బలహీనంగా మారుతారని అంటున్నారు.

ఉపాధి పొందుతున్న యువత...

వేసవి కాలం ప్రారంభంలో ఎండలు తీవ్రత పెరగడం వలన సీజనల్ వ్యాపారాలు ఊపందు కున్నాయి. ప్రతియేటా నిరుద్యోగులు ఉపాధి కోసం చిరు వ్యాపారులైన కొబ్బరి బొండాలు, జ్యూస్, లస్సీ, చెరుకు విక్రయాలు, శీతల పానీ యాల విక్రయాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. తోపుడు బండ్లు, ఫుట్పాత్లపై, చిన్న చిన్న కోట్లను ఏర్పాటు చేసు కుని విక్రయాలు సాగిస్తున్నారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు..

రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రత రోజుకు పెరిగిపోతున్నాయి. జనులు ఇండ్లు దాటి బయటకు రావడంలేదు. రాష్ట్రంలో ఉత్తర దిశ నుంచి అతి తక్కువ ఎత్తులో వేడి గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంటుంది. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల సమయంలో బయటి ప్రయాణా లేవీ చెయొద్దని సూచిస్తున్నారు.

సామాన్యుని దృష్టి కూలర్ల వైపే...

రోజు రోజుకు ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడి అధికంగా ఉంటుండగా.. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపటం లేదు. ఇళ్లల్లోని ఫ్యాన్ గాలి సైతం వేడిగా వస్తున్న క్రమంలో అందరి దృష్టి కూలర్ల వైపు పడింది. ఎండ వేడిమి నుంచి రక్షణ పొందేందుకు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్న పరిస్థితులుండగా.. ఇంట్లో నైనా కూల్ కూల్గా ఉండాలని భావిస్తున్నారు. ఏసీల కొనుగోలుపై అయిష్టత ఉన్న వారు కూలర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో సమ్మర్‌లో ఇంట్లో ఉన్నంత సేపయినా చల్లగా ఉండేందుకు ఇష్టపడుతున్నారు.

ఆకట్టుకునేలా డిజైన్లు...

చాలా మంది దుకాణదారులు వినియోగదారులను ఆకట్టుకునేందుకు దుకాణం ఎదుట రకరకాల కూలర్లను అందుబాటులో ఉంచుతున్నారు. గతంలో గడ్డితో తయారు చేసిన కూలర్స్ ఉండగా.. తాజాగా కూలింగ్ ప్యాడ్స్ కలిగిన కూలర్లు, బ్లోయర్ తో కూడిన కూలర్ తదితర రకాలు లభిస్తున్నాయి. ఇవి సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటున్న క్రమంలో అధికంగా కూలర్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.. వేసవి కాలంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్ గాలి వేడిగా ఉంటున్న క్రమంలో అధికంగా కూలర్లను కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింతగా ఉండే అవకాశం ఉండడంతో పాటు వడగాల్పులు వీస్తుంటాయి. ఈ క్రమంలో వాటి నుంచి రక్షణ పొందేందుకు కూలర్లను కొనడానికి మొగ్గు చూపుతున్నారు. కూలర్ల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయనే చెప్పుకోవచ్చు. ప్రారంభ ధర రూ.3 వేల నుంచి రూ.26 వేల వరకు ఉన్నాయి. ఇందులో లీటర్లు, కంపెనీల బట్టి ధరలుండగా.. అందుబాటులో సామాన్యులు రూ.3 వేల నుంచి రూ.10వేల వరకు కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వీటిలో లీటర్ల కెపాసిటీ అధికంగా ఉంటే మరింత చల్లదనంగా ఉంటాయనే భావనలో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

ఫీచర్స్ ఆధారంగా ధరలు..

ఎండలు అధికంగా ఉంటున్న క్రమంలో కూలర్లను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. సులభ వాయిదాలతో సామాన్యులకు సైతం ధరలు అందుబాటులో ఉన్నాయి. సైజు, క్వాలిటీని బట్టి మార్కెట్లో అందుబాటులో లభిస్తున్నాయి.

- కోట రాజేష్ కుమార్, విక్రయదారుడు

మానసిక ప్రశాంతతకు పార్కులు దోహదం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: పిల్లల ఆటవిడుపుకు, పెద్దల మానసిక ప్రశాంతతకు పార్కులు ఎంతో గాను దోహదపడతాయని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గం 125 - గాజుల రామారం డివిజన్ పరిధి మహాదేవపురంలో 90 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహదేవపురం పార్కును బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎంపి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ పిల్లల ఆటవిడుపుకు, పెద్దలకు మానసిక ప్రశాంతతకు చేకూర్చడంలో పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని, పార్కులను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత అందరిపై ఉందని వారు తెలియజేశారు. అనంతరం ప్రజలు ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎంపి ఈటెల రాజేందర్‌ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, తెలంగాణ సాయి, చెట్ల వెంకటేష్, సుంకరి చందు, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, ఆంజనేయులు, రాములు గౌడ్, వహీద్, దూలప్ప, బోయిని మహేష్, శివ నాయక్, ప్రసాద్, మహదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, రంగా రావు, కోశాధికారి ప్రభాకర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ రామచంద్ర రెడ్డి, ప్రవీణ్ కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సినిమాలకే గద్దర్ అవార్డు ఇవ్వాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : తెలంగాణ సినిమాలకే గద్దర్ అవార్డులివ్వాలని తెలంగాణ సినిమా వేదిక (టీసీవీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అలాగే ఫిలిం ఛాంబర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో తామే తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని వెల్లడించింది. బషీర్ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీయూ జేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డితో కలిసి టీసీవీ కన్వీనర్ లారా, కో-కన్వీనర్ మోహన భైరాగిలు మాట్లాడారు. తెలంగాణ సినిమా అభివృద్ధి లక్ష్యంగా టీసీవీ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సినిమా పాలసీని ప్రకటించాలని కోరారు. తెలంగాణ సినిమాలకే గద్దరన్న అవార్డులు ఇవ్వాలన్నారు. ఆంధ్ర సినిమాలకు గద్దరన్న అవార్డులు ప్రకటిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం చిన్న సినిమాలను ఆదుకోవాలని, తెలంగాణ సంస్కృతిక సాంప్రదాయాల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సినిమా రంగంలో ఆంధ్ర ఆధిపత్యాన్ని అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ సినిమా, జానపద అనేక కళా రంగాల్లో తెలంగాణ వెనుకబడి ఉందని వివరించారు. కడుపు మాడ్చుకొని కళా నైపుణ్యంతో నటనను నమ్ముకుని ఫిలింనగర్ లో వీధుల వెంట తిరుగుతున్న తెలంగాణ యువతకు సినిమా అవకాశాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సినిమా కళాకారులకు పెన్షన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కార్పొరేటర్ శాంతి

విశాలాంధ్ర - కాప్రా : డివిజన్లోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం పాటు పడుతున్న డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌కు బుడగ జంగాల సంఘం ప్రతినిధులు కాలువతో సత్కరించి నాచారంలో అన్నపూర్ణ కాలనీలో ఉన్న బుడగ జంగాల స్మశానవాటిక అభివృద్ధి కొరకు 50 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం తొందర్లోనే స్మశాన వాటిక అభివృద్ధి చేయడానికి 50 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది టెండర్ ప్రక్రియ పూర్తి అయింది. ఈ వారంలో పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కే నర్సింహ, వి.కిష్టయ్య, నరసింహ శంకర్, లడ్డు శివరామ్, కృష్ణ వీ.సుధాకర్ సి.మల్లేష్ కె రాము, వి శ్రీకాంత్, ఏ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు...



విశాలాంధ్ర - అమనగల్లు : అమనగల్లు పట్టణంలోని అంగడి బజారులో వ్యాపార దుకాణ సముదాయాలపైన విద్యుత్తు తీగలు ఉండటంతో వ్యాపారస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తీగలను సరిచేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులను విన్నవించినా పట్టించుకోవడం లేదని కిరాణా షాప్ సంఘం అధ్యక్షులు కండె పాండురంగయ్య విద్యుత్ వాపోతున్నారు. లూజు లైన్లుగా మారడంతో వైర్లు కదిలి నిప్పులు చేరిగనట్లు అవుతుందని దాంతో దుకాణాలు షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండడంతో గాలి దుమారాలు వచ్చినప్పుడు ఇవి మరింత కిందకు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని పాత్రికేయ సమావేశం ద్వారా తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంఈఓ

విశాలాంధ్ర - అమనగల్లు : 1 నుండి 9 వ తరగతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆమనగల్ మండల కేంద్రంలో వేసవి శిక్షణా శిబిరంను ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాధికారి పాండు తెలిపారు. శిక్షణ శిబిరంలో భాగంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 05 నుండి 19వ తేదీ వరకు ఉదయం 8గంటల నుండి 11 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున మండలంలోని విద్యార్థిని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

దేశం కోరేది తప్పక జరుగుతుంది: రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల వేళ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై దాడులకు యత్నించేవారికి తగిన రీతిలో బదులిస్తామని హెచ్చరించారు. ఢిల్లీలో జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్ కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం తన బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ పని తీరు, పట్టుదల గురించి అందరికీ తెలుసని, ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుందని రక్షణ మంత్రిగా హామీ ఇస్తున్నా అని రాజ్‌నాథ్ వక్కాణించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, పాక్‌పై ప్రతీకార చర్యల వేళ రాజ్‌నాథ్ సింగ్ తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. 'మన వీరజవాన్లు దేశ భౌతిక స్వరూపాన్ని కాపాడుతుంటే.. రుషులు, జ్ఞానులు దేశ ఆధ్యాత్మిక రూపాన్ని పరిరక్షిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. భారత్ శక్తి సాయుధ దళాల్లోనే కాదు.. దాని సంస్కృతి, ఆధ్యాత్మికతలోనూ ఉందని రాజ్‌నాథ్ అన్నారు.

యుద్ధం చేస్తే... వందేళ్లు వెనక్కి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర -తిరుపతి: ఉగ్రవాదులపై పోరు మానవాళికి మేలు చేస్తుందని... కానీ యుద్ధ వాతావరణాన్ని ప్రజలు కోరుకోవడం లేదన్నది ప్రధాని మోదీ ప్రభుత్వం గుర్తించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ భవన్‌లో కన్వీనర్ పి.అంజయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణ మాట్లాడుతూ... పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశ పరిణామాలు పరిశీలిస్తే భారత్, పాక్ దేశాలు యుద్ధానికి కాలు దువ్వుతున్నట్లు స్పష్టమవుతున్నదన్నారు. యుద్ధం వల్ల ప్రాణ , ఆస్తుల నష్టం తప్ప సాధించే అభివృద్ధి ఏమీ ఉండదని చరిత్ర చెబుతోందన్నారు. ప్రధాని మోదీ... యుద్ధ విమానాలను సిద్ధం చేయడం, సైన్యాన్ని మన దేశ సరిహద్దులకు తరలించడం చూస్తుంటే యుద్ధానికి సన్నద్ధమౌతున్నట్టు కనబడుతోందన్నారు. కానీ పాకిస్థాన్‌పై యుద్ధం కాకుండా ఉగ్రవాదాన్ని తుదముట్టించడానికి మన దేశ శక్తిసామర్థ్యాలను వినియోగించాలని సూచించారు. యుద్ధంతో దేశ సమగ్రత, సౌభ్రాతృత్వం దెబ్బతింటుందన్నారు. మనది లౌకిక భారతదేశం అని, ఇక్కడ అన్ని కులాలు, మతాలు తమతమ విశ్వాసాల ప్రకారం జీవించడానికి రాజ్యాంగం హక్కులు కల్పించిందన్నారు. యుద్ధం ప్రకటిస్తే వీటన్నింటికీ విఘాతం ఏర్పడుతుందన్నారు. పాలకులు తమ అధికారాన్ని కాపాడడం కోసం మైనార్టీలను బూసిగా చూపి... కొన్ని ప్రేరేపిత సంస్థలు పనిగట్టుకుని భారతీయ ముస్లింలపై విషం కక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధం కారణంగా ఉక్రెయిన్... రష్యా దేశాలు కూడా వేలాదిమంది సిపాయిలను, ప్రజలను... ఆస్తులను నష్టం చేసుకుని అభివృద్ధిలో వందేళ్లు వెనక్కి వెళ్లాయనేది స్పష్ట మౌతోందన్నారు. మోదీ ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించాలని నారాయణ అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాస నాగరాజు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడున ఎ. రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, కాంగ్రెస్ నేత మాంగాటి గోపాల్ రెడ్డి, ఇండియన్ రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎ. సుబ్రహ్మణ్యం, న్యూ డెమోక్రసీ నాయకులు పాటూరు వెంకటరత్నం, ఇఫ్ట్ పట్టణ నాయకులు లోకేశ్వర్ రెడ్డి, కవి రచయిత గొడుగు చింత గోవిందయ్య, ముస్లిం మత పెద్దలు అహ్మద్ షఫీ ఖాద్రీ, మాలిక్, నూరుల్లా భాష, అమీర్ భాష, సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆమూరి సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

అన్నదాతలకు 'కూటమి' అండ

48.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు: మంత్రి నాదెండ్ల

విశాలాంధ్ర బ్యూరో -కాకినాడ: అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జీఆర్‌టీ గ్రాండ్ హోటల్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం రబీ, ఖరీఫ్ సీజన్లలో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా... కూటమి ప్రభుత్వం పది నెలల కాలంలో 48 లక్షల 43 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు తెలిపారు. అదనంగా 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు. రూ. 11 వేల కోట్లు రైతుల ఖాతాల్లో 24 గంటలలో జమ చేసినట్టు పేర్కొన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలో మరో మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రైస్ మిల్లర్లు రైతులకు అండగా ఉండాలని సూచించారు. తూర్పుగోదావరి జిల్లాలో 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నులు, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 97 వేల మెట్రిక్ టన్నులు, కాకినాడ జిల్లాలో 58, 645 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వివరించారు. రైతులు వద్ద ఉన్న ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయాలని, తక్షణం సీఎంఆర్ ద్వారా డబ్బులు చెల్లించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. కొన్ని ప్రాంతాలలో 60 బస్తాల దిగుబడి రావడం శుభ పరిణామమన్నారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ. 1674 కోట్లు నెల రోజుల్లోనే రైతులు ఖాతాల్లో కూటమి ప్రభుత్వం జమ చేసినట్టు తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలో 20 మంది కౌలు రైతులు చనిపోతే పవన్ కల్యాణ్ రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం చేశారన్నారు. తేమ విషయంలో 17 శాతం నుంచి 24 శాతం వరకు వెసులుబాటు కల్పించినట్టు చెప్పారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోటా సుధీర్, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు.

రైతు ఉద్యమ యోధుడు అంజాన్

వర్ధంతి సభలో రావుల వెంకయ్య, రాజన్ క్షీరసాగర్

లక్నో: రైతు ఉద్యమ యోధుడు అతుల్ కుమార్ అంజాన్ అని, రైతుల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య అన్నారు. సీపీఐ నాయకులు, ఏఐకేఎస్ జాతీయ మాజీ నాయకులు అతుల్ కుమార్ అంజాన్ ప్రథమ వర్ధంతి సభ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మొవు పట్టణంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రైతు నాయకులు రమేశ్ పాండే అధ్యక్షత వహించగా, రాష్ట్రం నలుమూలల నుంచి 500 మందికి పైగా హాజరయ్యారు. సభలో రావుల వెంకయ్య, ఏఐకేఎస్ అధ్యక్షులు రాజన్ క్షీరసాగర్, సీపీఐ ఉత్తర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి అరవింద్ స్వరూప్, రాష్ట్ర రైతు సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర యాదవ్, షంషేర్ బేగ్, వివిధ పార్టీల, రైతు సంఘాల నాయకులు, అతుల్ కుమార్ అంజాన్ సోదరి కిరణ్ అంజాన్ సహా 60 మంది ప్రసంగించారు. సభ ఉదయం 11:00 గంటలకు ప్రారంభమై సాయంత్రం 3:00 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రావుల వెంకయ్య మాట్లాడుతూ అతుల్ కుమార్ అంజాన్ మరణించి సంవత్సరం గడిచిపోయిందన్నారు. ఉత్తర ప్రదేశ్ గడ్డ మీద రైతు ఉద్యమాల కోసం పని చేసిన మాజీ ప్రధాన మంత్రులు... జై జవాన్ జై కిసాన్ నినాదం ఇచ్చిన లాల్ బహదూర్ శాస్త్రి, రైతులకు ఆత్మబంధువుగా ప్రసిద్ధిగాంచిన చౌదరి చరణ్ సింగ్, రైతుల కోసం పని చేసిన మహేంద్ర తికైత్ సరసన అతుల్ కుమార్ అంజాన్ నిలబడటం చరిత్రాత్మకమని అన్నారు. దేశంలో 1936 ఏప్రిల్ 11న ఏర్పడిన తొలి అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 90 సంవత్సరాలు పూర్తి చేసుకుని ముందుకు సాగుతోందన్నారు. దానిలో 27 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పని చేసిన ఘనత అతుల్ కుమార్ అంజాన్‌కు దక్కిందని తెలిపారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి సీ2+50 పాలసీని రూపొందించడంలో అంజాన్ ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. రైతు రుణాల రద్దు కోసం, దేశంలోనే తొలిసారిగా 60 సంవత్సరాలు నిండిన రైతులందరికీ నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని కోరుతూ ఆయన ఉద్యమించారని తెలిపారు. అతుల్ కుమార్ అంజాన్ విద్యార్థి దశ నుంచి తుది శ్వాస వరకు అలుపెరగని పోరాటాలు చేసి విజయాలు సాధించారని పేర్కొన్నారు. రాజన్ క్షీరసాగర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ తీసుకువచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాల రద్దు కోసం జరిగిన రైతాంగ పోరాటంలో అతుల్ కుమార్ అంజాన్ కృషి ఎనలేనిదని తెలిపారు. నేడు రైతుల ప్రయోజనాల కోసం మనమందరం కృషి చేయడమే అంజాన్‌కు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌గా డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌గా ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా డాక్టర్ గోగినేని సుజాతను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌన్సిల్ సభ్యులు రాజీనామా చేయడంతో కొత్త కౌన్సిల్ ఏర్పాటైంది. మొత్తం 23 మంది సభ్యులు ఉండగా ఆరుగురు నామినేటెడ్ సభ్యులను మాత్రమే ప్రభుత్వం నియమించింది. మరో 13 మందిని వైద్యులు ఎన్నుకోవాల్సి ఉండగా, నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. కౌన్సిల్ సాధారణ కార్యకలాపాలను రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ ఐ.రమేష్ చూసుకున్నారు. వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్స్‌లో క్రెడిట్ అవర్స్, విదేశాలలో వైద్య విద్య పూర్తి చేసి వచ్చిన రాష్ట్ర విద్యార్థుల విషయంలో ముఖ్యంగా కరోనా సమయంలో బోధనా సమస్యలు, ఇంటర్న్‌షిప్ తదితర అంశాలలో కౌన్సిల్ నిర్ణయాలు తీసుకోవాలి. కౌన్సిల్ పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఆలస్యం కావడంతో చాలా మంది పీజీ నీట్ పరీక్ష రాసేందుకు అర్హత కోల్పోయారు. ప్రభుత్వం కొత్తగా కౌన్సిల్ చైర్మన్, వైస్ చైర్మన్లను నియమించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

అప్పట్లో జరిగింది తప్పే

1984 అల్లర్లపై రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై ఓ సిక్కు యువకుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీశారు. అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ను నేరుగా ప్రశ్నించారు. సిక్కు వ్యతిరేక అల్లర్లపై, అల్లర్ల కేసులో దోషిగా తేలిన సజ్జన్ కుమార్ వంటి నేతలపై కాంగ్రెస్ పార్టీ ఏం చర్యలు తీసుకుందని అడిగారు. సజ్జన్ కుమార్ ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నాడని గుర్తుచేశారు. భారత దేశంలో బీజేపీ ప్రభుత్వం వల్ల సిక్కులు భయపడుతూ బతకాల్సి వస్తోందని, తలపై టర్బన్ ధరించకుండా చట్టాలు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రాహుల్ చెప్పిన విషయాన్ని ఆ విద్యార్థి గుర్తుచేశాడు. తలపాగా ధరించడం, కడా వేసుకోవడం, గురుద్వారాకు వెళ్లడం మాత్రమే కాదు సిక్కులకు భావప్రకటనా స్వేచ్ఛ కావాలని అన్నాడు. కాంగ్రెస్ పాలనలో అది లభించలేదని ఆరోపించాడు. ఇప్పటికీ కాంగ్రెస్ అగ్ర నేత అయిన మీరు (రాహుల్ గాంధీ) సిక్కులతో సయోధ్య కుదుర్చుకోలేదన్నాడు. బీజేపీ పాలన గురించి మీరు భయపెడుతున్నారు కానీ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ సజ్జన్ కుమార్ లాంటి నేతలను వెనకేసుకు వస్తోందని విమర్శించాడు. పాకిస్థాన్ లోని ఆనంద్ పూర్ సాహిబ్ ను సిక్కులు దర్శించుకునే వీలు కల్పించేందుకు బీజేపీ సర్కారు ఓ తీర్మానం చేయగా.. కాంగ్రెస్ పార్టీ దానిని వేర్పాటువాద పత్రంగా అభివర్ణించిందని గుర్తుచేశాడు. కాంగ్రెస్ పార్టీ తీరు ఇలాగే ఉంటే బీజేపీ పంజాబ్ లోకి కూడా ప్రవేశిస్తుందని ఆ యువకుడు తేల్చిచెప్పారు. సిక్కు యువకుడి ప్రశ్నలకు రాహుల్ గాంధీ జవాబిస్తూ.. 1980లలో భారత్ లో జరిగింది తప్పేనని తాను చాలాసార్లు బహిరంగంగానే చెప్పానని వివరించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో చాలా తప్పులు చేసిందని అంగీకరిస్తూనే ఆ సమయాలలో తాను లేననే విషయం గుర్తుచేశారు. అయినప్పటికీ, కాంగ్రెస్ చరిత్రలో చేసిన ప్రతి తప్పుకు తాను బాధ్యత వహించడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అమృత్ సర్ లోని స్వర్ణ దేవాలయాన్ని చాలాసార్లు సందర్శించానని రాహుల్ తెలిపారు. అదేవిధంగా సిక్కులతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా, బ్రౌన్ యూనివర్సిటీలో జరిగిన ఈ ప్రశ్నోత్తరాలపై బీజేపీ నేత అమిత్ మాలవీయ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ కేవలం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నవ్వులపాలవుతున్నారని వ్యాఖ్యానించారు.

లేడీస్ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాల కలకలం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని పరిధిలోని గుంటూరు బ్రాడీపేట శ్రీనివాస్ లేడీస్ హాస్టల్ బాత్రూమ్ వద్ద సీక్రెట్ కెమెరాల కలకలం సృష్టించింది. ఈ సంఘటనపై విద్యార్థినులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విద్యార్థినులు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో హాస్టల్‌కు బయట వ్యక్తులు వస్తున్నారని, తమకు అసభ్యకరంగా మెస్సేజ్‌లు చేస్తున్నారని, ఈ హాస్టల్ సురక్షితంగా లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఈ సంఘటనపై హాస్టల్ యాజమాన్యాన్ని పోలీసులు విచారిస్తున్నారు. గతేడాది కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలోని లేడీస్ బాత్రూమ్‌లో హెడెన్ కేమేరాల కలకలం సృష్టించిన విషయం విదితమే. అది దేశ వ్యాప్తంగా చర్చానీయాంశమైంది. విద్యార్థి, మహిళా సంఘాలు పెద్దఎత్తున ఆందోళనకు దిగాయి.

అదనంగా చుక్కనీరు ఇవ్వం

- మా జలాల దోపిడీని సహించం
- పంజాబ్ మంత్రి ధలివాల్ స్పష్టీకరణ
- హర్యానాతో ముదిరిన జల వివాదం
- నేడు విధాన సభ ప్రత్యేక భేటీ

చండీగఢ్: పంజాబ్-హర్యానా మధ్య జల వివాదం ముదిరింది. కేటాయించిన నీటిని వాడుకొన్న హర్యానా...అదనపు నీటి విడుదల కోసం డిమాండ్ చేస్తుండటంతో పరిస్థితి ఉద్రిక్తమైంది. ఆ రాష్ట్రానికి అదనంగా చుక్క నీరు కూడా విడుదల చేసేది లేదని పంజాబ్ తేల్చిచెప్పింది. తమ జలాల దోపిడీని సహించేది లేదని స్పష్టంచేసింది. కేంద్రంతో పాటు హర్యానాలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఆక్షేపించింది. మానవతా దృక్పథంతో తాగునీటి అవసరాల కోసం 4వేల క్యూసెక్కులను పంజాబ్ ఇప్పటికే ఇస్తుండగా మరో 8,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని హర్యానా డిమాండ్ చేస్తోంది. నంగల్ డ్యామ్‌పై కన్నేసింది. దీంతో ఆ డ్యామ్ వద్ద పంజాబ్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసుల మోహరింపుపై హర్యానా సీఎం మండిపడ్డారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హర్యానాతో జల వివాదంపై చర్చించేందుకు విధాన సభ ప్రత్యేక సమావేశాన్ని పంజాబ్ ప్రభుత్వం సోమవారం నిర్వహించబోతోంది. తాజా పరిణామాల క్రమంలో హర్యానాకు చుక్క నీరు విడుదల చేయబోమని పంజాబ్ మంత్రి కుల్దీప్ సింగ్ ధలివాల్ ఆదివారం స్పష్టంచేశారు. తమ వాటా జలాలను దోచేందుకు కేంద్రంతో పాటు హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. పంజాబ్ రాష్ట్రం బేషరతుగా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హర్యానా అఖిలపక్షం ఓ ప్రకటన చేసింది. దీనిని మంత్రి తోసిపుచ్చారు. రాష్ట్ర నీటి వాటా కోసం సీఎం మాన్ పోరాడుతున్నారని చెప్పారు. కుటుంబ పెద్ద ప్రతి రూపాయిని కూడబెట్టినట్లే... ముఖ్యమంత్రి కూడా పంజాబ్ ప్రజలు, రైతుల కోసం ప్రతి నీటి చుక్కను ఆదా చేస్తున్నారని అన్నారు. తమ జలాలను దోచుకునేందుకు బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో మాన్ తీసుకునే చర్యలకు మద్దతిస్తామన్నారు. భాక్రా డ్యామ్ నుంచి నీరు తీసుకున్నందుకు కేంద్రంపై మండిపడ్డారు. 'ఆ నీరు పంజాబ్ రైతులు, వ్యవసాయ రంగం కోసం, మీకు ఇచ్చేందుకు కాదు. మా నుంచి నీటిని లాక్కున్నారు. ఇక చుక్క నీరు కూడా కేంద్రం-హర్యానా ప్రభుత్వం తీసుకునేందుకు వీల్లేకుండా పంజాబ్ బిడ్డలమైన మేము అడ్డుకుంటాం' అని ధలివాల్ అన్నారు. హర్యానాకు ఇచ్చేందుకు తమ వద్ద నీరు లేదని తేల్చిచెప్పారు. ఈ ఏడాది మార్చికి కేటాయించిన నీటిలో 103 శాతాన్ని హర్యానా వినియోగించినట్లు పంజాబ్ చెబుతోంది. తమ వద్ద ఉన్న నీరు రాబోయే సీజన్‌లో ధాన్యం సాగుకు వాడతామని, హర్యానాకు ఇచ్చేందుకు మిగులు జలాలు లేవని మంత్రి ధలివాల్ అన్నారు. ఇదిలావుంటే, సీఎం మాన్ శనివారం నంగల్ డ్యామ్‌ను సందర్శించారు. అక్కడ నుంచి నీటిని విడుదల చేసేందుకు వీల్లేకుండా చర్యలు తీసుకున్నారు. నీటి విషయంలో దౌర్జన్యాన్ని సహించబోమని తేల్చిచెప్పారు. కేంద్రం-హర్యానా తీరును ఆక్షేపించారు.

స్ఫూర్తి ప్రదాత మారిన వెంకట్రావు

సంస్మరణ సభలో డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: కార్మిక హక్కుల పోరాటయోధుడు మారిన వెంకట్రావు భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాతని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ అధ్వర్యంలో జట్లు లాగుడు బండ్ల సంఘం మాజీ అధ్యక్షుడు మారిన వెంకట్రావు సంస్మరణ సభ ఆ సంఘం అధ్యక్షుడు పుప్పాల కన్నబాబు అధ్యక్షతన జరిగింది. మారిన వెంకట్రావు చిత్రపటానికి డేగా ప్రభాకర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరు హమాలీల హక్కుల కోసం, కార్మికులకు సమాన కూలి రేట్లు కోసం పోరాడిన నాయకుడని మారిన వెంక్రటావును కొనియాడారు. 32 ఏళ్లు జట్లు లాగుడు బండ్ల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో భవిష్యత్ కార్మికోద్యమాలు జరగాలన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మట్లాడుతూ వెంకట్రావు సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సేవలు అందించారన్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతునప్పుడు కూడా సలహాలు, సూచనలు ఇస్తూ కార్మికుల సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి అని కృష్ణచైతన్య అన్నారు. మారిన వెంకట్రావు తుది వరకు కార్మికుల సంక్షేమానికి పాటుపడ్డారని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య కొనియడారు. 12వ డివిజన్ కార్పొరేటర్ కర్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకట్రావు డివిజన్ సమస్యల పరిష్కారానికీ కృషి చేశారన్నారు. మారిన వెంకట్రావు స్ఫూర్తి ప్రదాతని సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు, సీపీఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, ఐఎఫ్టీయూ నాయకుడు రమణ, అడ్వకేట్ వాకాడ రాజారావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, కొల్లూరు సుధారాణి, గొర్లి స్వాతి, కొండేటి రాంబాబు, ఉప్పులూరి రవి, తెర్లాపు శ్రీను, ఎర్ర వెంకటేశ్వరరావు, లక్క పాము చిట్టిబాబు, జుజ్జువరపు సురేంద్ర పాల్గొన్నారు.

'వక్ఫ్'పై నేడు సుప్రీంలో మళ్లీ విచారణ

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం మరోసారి విచారించనుంది. గత విచారణ సమయంలో చట్టంలోని రెండు వివాదాస్పద నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం హామీ ఇచ్చింది. ఈనెల 5వ తేదీ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది. వక్ఫ్ కౌన్సిల్, బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించొద్దని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. గత విచారణ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. అన్నిరకాలుగా జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే చట్టాన్ని రూపొందించినట్లు పేర్కొంది. ప్రభుత్వం పూర్తిస్థాయి వాదనలు వినకపోవడం సముచితం కాదని పేర్కొన్నారు.

మాల్దీవుల అధ్యక్షుడి ప్రపంచ రికార్డు

15 గంటల మారథాన్ ప్రెస్ కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ: మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు అరుదైన రికార్డు నెలకొల్పారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన తన కార్యాలయంలో 15 గంటల పాటు విలేకరులతో సమావేశమయ్యారు. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన చేసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ రికార్డును ముయిజ్జు బద్దలు కొట్టినట్లు పేర్కొంది. ముయిజ్జు (46) శనివారం ఉదయం 10 గంటలకు మారథాన్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అది ప్రార్థనల విరామాలతో 14గంటలు 54 నిమిషాల పాటు సాగింది. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా సమావేశం కొనసాగడంతో అధ్యక్షుడు కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. విలేకరుల ప్రశ్నలకు ముయిజ్జు సమాధానాలు ఇచ్చినట్లు వెల్లడించింది. 2009లో మాల్దీవుల అధ్యక్షుడిగా ఉన్న మహమ్మద్ నషీద్... హిందూ మహా సముద్రం అడుగున కేబినెట్ సమావేశాన్ని నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

మరోసారి ఉగ్రదాడి జరగకుండా భారత ప్రతిస్పందన ఉండాలి: సచిన్ పైలట్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ వెల్లడించారు. మరోసారి దేశంలో ఉగ్రదాడులు జరగకుండా.. భారత్ నుంచి ప్రతిస్పందన ఉండాలని ఆయన కోరారు. ఈ విషయంలో విపక్షాలన్నీ ఐక్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. 'పాకిస్థాన్‌కు తగిన సమాధానం ఇచ్చేందుకు భారత్ పూర్తి సిద్ధంగా ఉంది. ప్రతిపక్షాలే కాదు.. దేశంలోని 140 కోట్ల ప్రజలు ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ఐక్యంగా ఉన్నారు. దేశంలో ఇకపై ఉగ్రదాడులు జరగకుండా.. సాధ్యమైనంత ఉత్తమ మార్గంలో భారత్ నుంచి ప్రతిస్పందన ఉండాలి' అని సచిన్ పైలట్ కోరారు.

ఎన్డీయే ఓటమే లక్ష్యం

243 సీట్లలో ఇండియా పోటీ: బీహార్ సభలో వక్తలు

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు వ్యతిరేకంగా ఇండియా ఐక్య సంఘటన 243 స్థానాల్లో పోటీ చేస్తుందని రాష్ట్రీయ జనతాదళ్ ఎంపీ మనోజ్ ఝా ప్రకటించారు. బీహార్ ఎన్నికలకు సన్నద్ధత క్రమంలో రాజధాని పాట్నాలో ఇండియా ఐక్య సంఘటన సంవాద్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆర్‌జేడీ నేత, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, సీపీఐ బీహార్ కార్యదర్శి రామ్‌నరేశ్ పాండే, సీపీఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య తదితరులు ప్రసంగించారు. బీహార్ ఎన్నికల్లో ఐక్య పోటీకి సంకల్పించారు. 'మేం ఐక్యంగా ఉన్నాం. ప్రతి సీటుకూ గట్టిపోటీ ఇస్తాం. ఎన్డీయేను ఓడిస్తాం' అని ఉద్ఘాటించారు. కార్మికుల హక్కుల కోసం ఈనెల 20న జరబోయే కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెకు ఇండియా ఐక్య సంఘటన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ (ఎంఎల్), వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశానంతరం మనోజ్ ఝా విలేకరులతో మాట్లాడుతూ ఎన్డీయేను ఓడించేందుకు బూత్ స్థాయి నుంచి కలిసికట్టుగా పనిచేయాలని ఇండియా నిర్ణయించినట్లు తెలిపారు. బీహార్ మహాకూటమికి నాయకత్వంపై ఊహాగానాలను కొట్టివేశారు. తేజస్వి నాయకత్వంపై వివాదం లేదన్నారు. సరైన సమయంలో తగిన ప్రకటన వెలువడుతుందని మనోజ్ ఝా చెప్పారు. కులగణన కోసం ఐక్య సంఘటన ప్రధానంగా డిమాండ్ చేసిందని, అదే ఎన్నికల ప్రధాన అంశమేనన్నారు. కులగణన జరిగేంత వరకూ తమ దృష్టి దానిపైనే ఉంటుందని చెప్పారు. సంబంధిత డాటా సరైనదేనా అనేది పరిశీలిస్తామని మనోజ్ ఝా చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.